www.akshratimes.com
తెలుగు దినపత్రిక
# అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
RNI.NO : APTEL/2022/90211
సంపుటి : 04 సంచిక : 76 పేజీలు : 08, వెల రూ. 1 రూ/ www.akshratimes.com శుక్రవారం 03 - 07 - 2026
Published by ANANTAPURAM : Circulated in Anantapuram, Satya Sai, Vijayavada, Ysr Kadapa, Annamayya, Prakasham, Bapatla,Ntr, Karimnagar,Guntur,East Godavari, West Godavari, Kakinada, Eluru, Sri Potti Sriramulu Nellore, Kurnool


స్పీడ్ పోస్టులో గంజాయి దందా: భారీ నెట్‌వర్క్ బట్టబయలు చేసిన హైదరాబాద్ నార్కోటిక్స్ వింగ్

## ఏపీ నుంచి దేశవ్యాప్తంగా
# 'వీబీ జీ రామ్ జీ' పథకం

- కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్, చంద్రబాబు, పవన్ చేతుల మీదుగా ప్రారంభం
- మెరుగైన సవరణలతో వీబీ జీరామ్‌జీ
- గ్రామాల ముఖచిత్రం మార్చే కార్యక్రమం
- వీబీ జీరామ్‌జీ పథకంపై ప్రధాని మోదీని అభినందించాలన్న చంద్రబాబు
- గతంలో ఉపాధి హామీని రాయలసీమ నుంచే ప్రారంభించారని, మెరుగైన సవరణలతో వీబీ జీరామ్‌జీని మళ్లీ తీసుకొచ్చారని గుర్తుచేసిన సీఎం
- ఏపీలోని రైల్వే కోడూరు నుంచి 'వీబీ జీ రామ్ జీ' జాతీయ పథకం ప్రారంభం
- చారిత్రాత్మక ఘట్టానికి వేదికగా నిలిచిన ఏపీ
- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



**అమరావతి :**
వీబీజీ రామ్‌జీని పూర్తిగా సద్వినియోగం చేసుకుంటామని, ఇది గ్రామాల ముఖచిత్రం మార్చే కార్యక్రమమని సీఎం చంద్రబాబు వివరించారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన వీబీ జీరాంజీ ప్రారంభోత్సవం తిరుపతి జిల్లా ముక్కవారిపల్లెలో జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ మెరుగైన సవరణలతో వీబీ జీరామ్‌జీని మళ్లీ తీసుకొచ్చారని తెలిపారు. మోదీ నాయకత్వంలో భారత్ అగ్రగామిగా - మిగతా 2 లో

## 16 నుంచి 'తల్లికి వందనం'
# రెండో విడత

- జులై 16 నుంచి 18 మధ్య తల్లుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామన్న మంత్రి లోకేశ్
- 150 రోజుల్లో 16,000 టీచర్, 6,000 కానిస్టేబుల్ పోస్టుల భర్తీ చేశామని వెల్లడి
- ఈ ఏడాది మరో 10,000 పోస్టులతో మెగా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్న లోకేశ్
- ప్రభుత్వ విజయాలపై జులై 15 నుంచి ఇంటింటి ప్రచారం చేయాలని పిలుపు



**అమరావతి :**
'తల్లికి వందనం' పథకం రెండో విడత నిధులను జులై 16 నుంచి 18వ తేదీల మధ్య తల్లుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా మెగా - మిగతా 2 లో

## 50 శాతం పట్టభద్రుల్లో
# నైపుణ్యాలు శూన్యం



- శ్రీసిటీ వర్సిటీ ప్రారంభోత్సవంలో శ్రీనిరాజు
- తిరుపతి జిల్లా శ్రీసిటీలో అంతర్జాతీయ యూనివర్సిటీ ప్రారంభం
- యువతలో నైపుణ్యాల అంతరాన్ని పూడ్చడమే తమ లక్ష్యమన్న చైర్మన్ శ్రీనిరాజు
- సీఎం చంద్రబాబు నిర్దేశం మేరకే గ్యారంటీ ఉపాధి లక్ష్యంగా వర్సిటీ ఏర్పాటు
- విదేశీ వర్సిటీల తరహాలో వర్క్ స్టడీ మోడల్‌ను అమలు చేస్తున్నట్లు వెల్లడి

**అమరావతి :**
మన దేశంలో ఏటా కోటికి పైగా యువత డిగ్రీలు పూర్తి చేస్తున్నా, వారిలో 50 శాతానికి పైగా మందిలో ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలు ఉండటం లేదని శ్రీసిటీ చైర్మన్ శ్రీనిరాజు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నైపుణ్యాల కొరత కారణంగా 18-22 ఏళ్ల మధ్య వయసున్న యువత నుంచి ఉత్పాదకత కొరవడుతోందని ఆయన అన్నారు. - మిగతా 2 లో


2 లో

## అంటార్కిటికాలో
# 'రక్త జలపాతం'

- ఇనుము అధికంగా ఉన్న ఉప్పునీరు గాలితో చర్య జరపడం వల్లే ఎరుపు రంగు
- ఈ నీటి మూలం గ్లేసియర్ కింద 15 లక్షల ఏళ్ల నాటి పురాతన సరస్సు
- గ్లేసియర్‌లోని పగుళ్లు, రహస్య మార్గాల గుండా నీరు పైకి
- మంచు కింద లక్షల ఏళ్లుగా సూక్ష్మజీవులు జీవిస్తున్న వైనం

# 'పరస్పర విశ్వాసమే అతిపెద్ద వ్యూహాత్మక ఆస్తి'



- భారత్- జపాన్ ద్వైపాక్షిక సంబంధాలపై ప్రధాని మోదీ
- భారత్- జపాన్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలకు కొత్త పుంతలు
- ఏఐ, రక్షణ, ఆరోగ్య సంరక్షణ రంగాల్లో ఒప్పందాలు
- సాంకేతికతను మూలస్తంభంగా అభివర్ణించిన ప్రధాని మోదీ

**ఢిల్లీ :**
'పరస్పర విశ్వాసమే అతిపెద్ద వ్యూహాత్మక ఆస్తి' అని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. భారత్, జపాన్ దేశాలు రక్షణ రంగంలో మొట్టమొదటి సారిగా ఒక ఉమ్మడి ప్రాజెక్టుపై చారిత్రాత్మక ఒప్పందం కుదుర్చుకున్నాయని ఆయన తెలిపారు. దీనితో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సాంకేతికతలో సరికొత్త భాగస్వామ్యం కోసం ఇరు దేశాల ఒక ఉమ్మడి విజన్‌ను ఆవిష్కరించాయని చెప్పారు. ఢిల్లీలో జరిగిన భారత్-జపాన్ 16వ వార్షిక సదస్సులో జపాన్ ప్రధాని సనాయె తకాయిచితో కలిసి ప్రధాని మోదీ ఈ కీలక ప్రకటనలు చేశారు. జపాన్ నాయకురాలు తన 'చెల్లెలు' అని మోదీ సంబోధించారు."భారత్-జపాన్ వార్షిక శిఖరాగ్ర - మిగతా 2 లో

# అమర్‌నాథ్ యాత్ర తొలి బృందానికి చందర్‌కోట్‌లో ఘన స్వాగతం

- బల్తాల్ మార్గ యాత్రికులను ఆహ్వానించిన అధికారులు, పౌర సమాజం
- భద్రత, వసతులపై విస్తృత ఏర్పాట్లు చేసిన జమ్మూకశ్మీర్ యంత్రాంగం
- నేటి నుంచి ప్రారంభమై 57 రోజుల పాటు కొనసాగనున్న పవిత్ర యాత్ర
- ఇప్పటికే 3.5 లక్షల మందికి పైగా భక్తుల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్



**ఢిల్లీ :**
అమర్‌నాథ్ యాత్రకు సర్వం సిద్ధమైంది. ఈ యాత్రలో భాగంగా బల్తాల్ మార్గంలో బయల్దేరిన తొలి బృందం యాత్రికులకు నేడు ఘన స్వాగతం లభించింది. జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారిపై ఉన్న రాంబన్ జిల్లాలోని చందర్‌కోట్ వద్ద ఏర్పాటు చేసిన లంగర్ (ఉచిత భోజనశాల) వద్ద అధికారులు, స్థానికులు యాత్రికులను సాదరంగా ఆహ్వానించారు. రాంబన్ జిల్లా యంత్రాంగం, పౌర సమాజ ప్రతినిధులు, పలు లంగర్ - మిగతా 2 లో


## బెంగళూరు ఇస్రో కేంద్రానికి
# బాంబు బెదిరింపు కలకలం

- బెంగళూరులోని ఇస్రో ప్రధాన కార్యాలయానికి బాంబు బెదిరింపు
- చైర్మన్ కార్యాలయానికి ఈమెయిల్ ద్వారా అందిన సందేశం
- రంగంలోకి దిగిన బాంబ్ స్క్వాడ్, ప్రాంగణంలో క్షుణ్ణ తనిఖీలు
- తనిఖీల్లో ఏమీ లభ్యం కాలేదని, ఉత్తుత్తిదేనని ప్రకటన
- ఈమెయిల్ మూలాలపై దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు

**బెంగళూరు :**
భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ప్రధాన కార్యాలయంలో గురువారం బాంబు బెదిరింపు కలకలం రేపింది. బెంగళూరులోని ఇస్రో కేంద్రానికి ఈమెయిల్ ద్వారా వచ్చిన ఈ బెదిరింపు నకిలీదని పోలీసులు నిర్ధారించారు. - మిగతా 2 లో




# చర్చకు పిలిచి మొహం చాటేశారు



2 లో

- మంత్రి జూపల్లిపై హరీశ్ రావు ఫైర్
- చర్చకు పిలిచి మంత్రి జూపల్లి రాలేదని హరీశ్ రావు విమర్శలు
- తెలంగాణ భవన్‌కు వచ్చిన బీఆర్ఎస్ నేతలు, గైర్హాజరైన మంత్రులు
- గన్ పార్క్ వద్దకు వెళ్తుండగా హరీశ్ రావు, ఇతర నేతల అరెస్ట్
- ఖాళీ కుర్చీతో జూపల్లి కోసం కేటీఆర్ ఎదురుచూపులు
- టెండర్లు, అప్పులపై చర్చకు కాంగ్రెస్ భయపడుతోందన్న బీఆర్ఎస్



## బోడుప్పల్‌లో ఉద్రిక్తత
# కల్వకుంట్ల కవిత అరెస్ట్

- తెలంగాణ ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్
- ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు నెరవేర్చడం లేదని ఆరోపణ
- కవితతో పాటు పలువురు కార్యకర్తలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

**హైదరాబాద్ :**
తెలంగాణ ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టిన టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను పోలీసులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్ శివారులోని బోడుప్పల్‌లో గురువారం ఆమె నిరసన - మిగతా 2 లో

## ప్రభుత్వ పాఠశాలల
# టీచర్లకు మధ్యాహ్న భోజనం

- విద్యార్థులతో పాటు టీచర్లకూ బ్రేక్‌ఫాస్ట్, లంచ్
- కేబినెట్ కీలక నిర్ణయం
- సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ భేటీ
- పాఠశాల, కళాశాలల్లో విద్యార్థులతో పాటు టీచర్లకూ అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించాలని కేబినెట్ నిర్ణయం
- భోజన నాణ్యత, పర్యవేక్షణ పెంచడమే లక్ష్యం
- తెలంగాణ ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయం
- తొలి కాగితరహిత కేబినెట్ భేటీ



**హైదరాబాద్ :**
ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో విద్యార్థులతో పాటు టీచర్లకూ అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో ఇందుకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఉపాధ్యాయులకు కూడా వర్తింపజేయాలని తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. విద్యార్థులకు అందజేసే భోజనం నాణ్యతను పెంచడంతో పాటు, పర్యవేక్షణను మెరుగుపరిచి జవాబుదారీతనాన్ని పటిష్ఠం చేసేందుకే ఈ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పీఎం-పోషణ్ (మధ్యాహ్న భోజనం) పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులకు పౌష్టికాహారం అందుతోంది. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కూడా అదే భోజనాన్ని స్వీకరించడం వల్ల ఆహార పరిశుభ్రత, పోషక విలువలు మరింత మెరుగవుతాయని ప్రభుత్వం భావిస్తోంది. ఉపాధ్యాయుల ప్రత్యక్ష - మిగతా 2 లో

# సంపాదకీయం

## బంగ్లాతో అతుకు..!



నాకు చావంటే భయంలేదు, ఈ ఏడాదిలోనే నా స్వదేశంలో కాలూనుతానని బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా ప్రకటించారు. రెండేళ్ళక్రితం దేశం నుంచి పారిపోయి, భారత్‌లో తలదాచుకున్న ఆమెకు ఒక్కసారిగా అంత ధైర్యం ఎందుకు వచ్చిందో తెలియదు. గత ఏడాది నవంబరులో బంగ్లాదేశ్‌లోని అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ ఆమెకు మరణశిక్ష విధించినప్పటినుంచీ ఆమెను అప్పగించమంటూ ఆ దేశం మనను అదేపనిగా పోరుతున్నది. ఈ తరుణంలో నిజంగానే హసీనా తన మాటకు కట్టుబడితే అది అమిత సాహసమే. ఉరిశిక్ష విధించిన సదరు ట్రిబ్యునల్‌ను దేశాన్ని అవిచ్ఛిన్నంగా పాలిస్తున్న కాలంలో హసీనాయే ఏర్పాటు చేశారు. అది వెలువరిస్తూ వచ్చిన తీర్పుల ఆధారంగానే ఆమె శత్రుసంహారం సాగించారు. బుధవారం ఆమె పార్టీ ఈ ట్రిబ్యునల్ రద్దుకోసం బంగ్లాదేశ్‌లో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతోంది. అక్రమంగా, రాజ్యాంగవ్యతిరేకంగా ఏర్పాటైన ఈ ట్రిబ్యునల్ తమ నాయకురాలికి విధించిన ఉరిశిక్షను రద్దుచేయాలన్నది దాని డిమాండ్. రెండేళ్ళక్రితం ఆమె ఆదేశాలమేరకే భద్రతాబలగాలు హెలికాప్టర్లు, డ్రోన్లు, మారణాయుధాలు వాడి ఉద్యమకారులను ఊచకోత కోశాయంటూ, ఆమెకు ఈ ట్రిబ్యునల్ మరణశిక్షతో పాటు అత్యంత కసిగా ఇంకొన్ని శిక్షలు కూడా విధించింది. అసలు ఆ ఉద్యమమే ప్రజావ్యతిరేక తీవ్రవాద గ్రూపుల ఆధ్వర్యంలో, రాజకీయ ప్రేరేపిత లక్ష్యాలతో జరిగిందని, భద్రతాదళాలు తీసుకున్న ప్రతీ చర్యకూ తమ నాయకురాలిని బాధ్యురాలిని చేయడం సరికాదని ఆ పార్టీ తన సుదీర్ఘమైన ప్రకటనలో వాదించింది. అంతర్జాతీయ పర్యవేక్షణలో తనపై విచారణ జరిపించాలన్న తమ నాయకురాలి కనీస కోరికను కూడా నెరవేరనివ్వకుండా ఈ ట్రిబ్యునల్‌ను అడ్డుపెట్టుకొని పాలకులు రాజకీయ కక్షతీర్చుకుంటున్నారని ఆరోపిస్తూ ఆ పార్టీ ఈ దేశవ్యాప్త నిరసనోద్యమాలకు సిద్ధపడుతోంది. హసీనాతో అంటకాగిన చాలామంది నాయకులను, అలనాటి మిత్రపక్షనేతలను కూడా ఈ ట్రిబ్యునల్ వదలడం లేదు. బుధవారం కూడా ఆ ట్రిబ్యునల్ రెండేళ్ళనాటి హింసకు కారకుడంటూ ఆమెకు కుడిభుజం లాంటి ఓ నాయకుడికి పదేళ్ళ కఠిన కారాగారం విధించింది. ప్రాణాలకు తెగించి నిజంగానే హసీనా తిరిగి తన స్వదేశానికి తిరిగివెళ్లిపోతారా? అన్న ప్రశ్నను అటుంచితే, ఆమె భారత్‌లో ఉన్నంతకాలం ఉభయదేశాల సంబంధాలు సవ్యంగా ఉండవన్నది వాస్తవం. 2024 ఆగస్టు 4న ఆమె పదవినుంచి దిగిపోయేంతవరకూ ఈ రెండుదేశాల స్నేహం, సాన్నిహిత్యం అద్భుతంగా ఉండేది. దాదాపు రెండుదశాబ్దాలపాటు భారత్ నిబ్బరంగా, నిర్భయంగా ఉండగలిగింది. అమెరికా ఆశీస్సులు, మన పొరుగుదేశాల అండదండలతో అనేక నెలలు సాగిన ఆ పోరాటంతో ఆమె చివరకు ప్రాణరక్షణకోసం పరుగులు తీయాల్సి వచ్చింది. తాత్కాలిక ప్రభుత్వాధినేతగా వచ్చిన మహ్మద్ యూనిస్ అందరి ఒత్తిళ్ళకూ లొంగి ఆమెకూ, ఆశ్రయం ఇస్తున్న భారత్‌కూ వ్యతిరేకంగా వ్యవహరించడంతో ద్వైపాక్షిక సంబంధాలు పూర్తిగా దిగజారాయి. హిందూ మైనారిటీలపై సాగిన దాడులను భారత్ తప్పుబడుతున్నకొద్దీ పొరుగుదేశంలో వారిపై హింస పెరుగుతూ వచ్చింది. అవామీలీగ్ మద్దతుదారులపైన కొన్ని సంస్థలూ సంఘాలు చేస్తున్న ఈ దాడుల్లో రాజకీయమే తప్ప మతం లేదని యూనిస్ సమర్థించుకొనేవారు. ఎగుమతులు నిలిపివేయడం వంటి భారత్ ప్రతీకారచర్యలు కూడా పరిస్థితిని వేడెక్కించాయి. గత ఏడాది డిసెంబరులో ఉస్మాన్‌హాదీ హత్య ఘటన మరింత అగాధాన్ని పెంచింది. బంగ్లాదేశ్ భవిష్య రాజకీయ పరిణామాలను అంచనావేయడంలో కాస్తంత జాప్యం జరిగినప్పటికీ, భారత ప్రభుత్వం ముందుగానే తారిఖ్ రహ్మాన్‌తో కాస్తంత సయోధ్య సాధించే ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఆయన ప్రధాని అయినప్పటినుంచీ ఉభయదేశాల సంబంధాలు కాస్తంత మెరుగుపడటం ఆరంభించాయి. యుద్ధకాలంలో భారత్ పొరుగుదేశానికి ఇంధనాన్ని సైతం అందించింది. ఇటీవల తారిఖ్ రహ్మాన్‌తో భారత విదేశాంగ మంత్రి జయశంకర్ భేటీ మంచి ముందడుగు. తరచు సమావేశాలు జరుగుతూ సంబంధాలను మెరుగుపరచుకొనే ప్రయత్నం సాగుతోంది. నాలుగువేల కిలోమీటర్ల సరిహద్దు ఉన్న బంగ్లాతో నదీజలాలు, విద్యుత్, సరిహద్దు రవాణా, అక్రమవలసలు ఇత్యాది సమస్యలు ఉండటం సహజం. పశ్చిమబెంగాల్‌లో ఇటీవల ఏర్పడిన బీజేపీ ప్రభుత్వం, ఎన్నికల హామీలు నిలబెట్టుకొనే పేరిట చేపడుతున్న చర్యలు బంగ్లాదేశ్‌తో మొగ్గతొడుగుతున్న ఈ సయోధ్యను దెబ్బతీయకుండా చూడాలి. రాజకీయాలను పక్కనబెట్టి ఇరుదేశాలు పరస్పర సహకారంతో ముందుకు సాగాలి.

## 16 నుంచి 'తల్లికి వందనం' రెండో విడత

**మొదటిపేజీ తరువాయి -** పేరెంట్-టీచర్ మీటింగ్‌లు (పీటీఎం) నిర్వహించే సమయంలోనే ఈ నిధులను విడుదల చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. రేణిగుంట మండలంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో లోకేశ్ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 150 రోజుల వ్యవధిలోనే 16,000 ఉపాధ్యాయ, 6,000 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టిందని తెలిపారు. ఈ ఏడాది మరో 10,000 పోస్టులతో మెగా జాబ్ క్యాలెండర్ విడుదల చేయనున్నట్లు వివరించారు. ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జులై 15 నుంచి 'ఇంటింటి ప్రచారం' చేపట్టాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. అదేవిధంగా, ప్రతిపక్ష పార్టీల వైఖరిని ప్రస్తావిస్తూ.. కార్యకర్తలు చెడు లక్షణాలను అలవర్చుకోవద్దని సూచించారు. ఈ పర్యటనలో భాగంగా లోకేశ్ పలు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి తనిఖీ చేశారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించడంతో పాటు, పలువురు లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన శ్రీకాళహస్తీశ్వర ఆలయాన్ని సందర్శించి, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## 50 శాతం పట్టభద్రుల్లో నైపుణ్యాలు శూన్యం

**మొదటిపేజీ తరువాయి -** తిరుపతి జిల్లా శ్రీసిటీలో ఏర్పాటు చేసిన శ్రీసిటీ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ (ఎస్ఐయూ) ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. పట్టభద్రుల్లో 95 శాతం మంది సరైన మార్గనిర్దేశం, సహకారం కోరుకుంటున్నారని శ్రీనిరాజు తెలిపారు. ఈ నైపుణ్యాల అంతరాన్ని (స్కిల్ గ్యాప్) పూడ్చేందుకే అంతర్జాతీయ ప్రమాణాలతో శ్రీసిటీ యూనివర్సిటీని ఏర్పాటు చేశామన్నారు. "ముఖ్యమంత్రి చంద్రబాబు గ్యారంటీ ఉపాధి కల్పించాలని మాకు దిశానిర్దేశం చేశారు. ఆయన ఆలోచనలకు అనుగుణంగానే సింగపూర్, కెనడా, జర్మనీ వంటి దేశాల్లో అమలవుతున్న వర్క్-స్టడీ మోడల్‌లో ఈ వర్సిటీని తీర్చిదిద్దాం" అని వివరించారు. వర్సిటీలో ఇంక్యుబేషన్, ఇన్నొవేషన్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి, ప్రముఖ పారిశ్రామి కవేత్త ప్రవీణ్ అక్కిరాజు తదితరులు పాల్గొన్నారు. కార్నెగి మెలాన్ యూనివర్సిటీకి చెందిన ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ రాజారెడ్డి, కేంద్ర మాజీ వాణిజ్య కార్యదర్శి జీకే పిళ్లై పంపిన సందేశాలను ఈ సందర్భంగా ప్రదర్శించారు.

## బెంగళూరు ఇస్రో కేంద్రానికి బాంబు బెదిరింపు కలకలం

**మొదటిపేజీ తరువాయి -** దీంతో అధికారులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. ఇస్రో కేంద్రంలోని చైర్మన్ డాక్టర్ వి. నారాయణన్ కార్యాలయానికి ఈ బెదిరింపు మెయిల్ అందింది. వెంటనే అప్రమత్తమైన ఇస్రో సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. దీంతో బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నాయి. ముందుజాగ్రత్త చర్యగా ప్రాంగణాన్ని ఖాళీ చేయించి క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలు కానీ, అనుమానాస్పద వస్తువులు కానీ లభ్యం కాలేదని అధికారులు స్పష్టం చేశారు. బాంబు బెదిరింపుపై పోలీసులు కేసు నమోదు చేసి, ఈ-మెయిల్ పంపిన వారిని గుర్తించేందుకు దర్యాప్తు చేపట్టారు. ప్రస్తుతం ఇస్రో కార్యాలయంలో కార్యకలాపాలు సాధారణ స్థితికి చేరుకున్నాయి. సాంకేతిక ఆధారాలతో నిందితులను పట్టుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఇటీవల దేశంలోని పలు కీలక సంస్థలకు ఇలాంటి నకిలీ బెదిరింపులు వస్తున్న నేపథ్యంలోనే ఈ ఘటన చోటుచేసుకుంది. జూన్ 29న ఎన్ఐఏ, డీఆర్‌డీఓ వంటి సంస్థలకు బెదిరింపు ఈ-మెయిళ్లు పంపిన కేసులో ఢిల్లీ పోలీసులు ఘజియాబాద్‌కు చెందిన 36 ఏళ్ల వ్యక్తిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.

## ప్రభుత్వ పాఠశాలల టీచర్లకు మధ్యాహ్న భోజనం

**మొదటిపేజీ తరువాయి -** పర్యవేక్షణ ఫలితంగా ఈ పథకం మరింత సమర్థవంతంగా అమలవుతుందని అధికారులు ఆశిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన తొలి కాగితరహిత కేబినెట్ భేటీని నిర్వహిస్తున్నారు. వీబీ జీరామ్‌జీ పథకం అమలుపై నిర్ణయం తీసుకోనున్నారు. ఖరీఫ్ సీజన్‌లో విత్తనాలు, ఎరువుల పంపిణీపై కీలక చర్చ జరగనుంది. ఎల్‌నినో పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలు, ప్రత్యామ్నాయ పంటలకు ప్రోత్సాహకాలు ఇవ్వడంపై సమాలోచనలు చేయనున్నారు. మూసీ తొలిదశ పనులకు ఆమోదం, మెట్రో విస్తరణపైనా కేబినెట్ చర్చించనుంది.

## ఏపీ నుంచి దేశవ్యాప్తంగా 'వీబీ జీ రామ్ జీ' పథకం

**మొదటిపేజీ తరువాయి -** ఎదుగుతోందని కొనియాడారు. వీబీ జీరాంజీ కోసం కేంద్రం రూ.7,700 కోట్లు, రాష్ట్ర వాటా 4 వేల కోట్లు మొత్తం 11 వేల కోట్లు ఖర్చు పెడుతున్నట్లు సీఎం వివరించారు. వీబీజీ రామ్‌జీని పూర్తిగా సద్వినియోగం చేసుకుంటామన్నారు. పని రోజులు వంద నుంచి 125 రోజులకు పెంచడం సంతోషించే విషయమని చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. వీబీ జీరామ్‌జీ కింద ఏ అభివృద్ధి పని అయినా చేసుకోవచ్చని భూసార పరిరక్షణ, రహదారులు, డ్రెయినేజీలు నిర్మించుకోవచ్చని సీఎం సూచించారు. దొంగ లెక్కలు రాసుకోవడానికి వీలు లేకుండా డిజిటల్ విధానం తెచ్చామన్నారు. పారదర్శకత కోసం రియల్‌టైమ్ మానిటరింగ్ ఉంటుందని స్పష్టం చేశారు. 'ఓటమి ఎరుగని నాయకుడు శివరాజ్‌సింగ్. ప్రజల మనిషి, అందరి మామ. ఏం అడిగినా వరాలిచ్చే కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్. వీబీ జీరామ్‌జీ పథకంపై ప్రధాని మోదీని అభినందించాలి, గతంలో ఉపాధి హామీని రాయలసీమ నుంచే ప్రారంభించారు. వీబీజీ రామ్‌జీని పూర్తిగా సద్వినియోగం చేసుకుంటామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. ఆ ఘనత పవన్‌దే: ఉపముఖ్యమంత్రి పవన్ నాయకత్వంలో గ్రామాల రూపురేఖలు మారుతాయని సీఎం తెలిపారు. కొత్త ఆలోచనలు, విధానాలతో సమాజానికి మేలు చేసేలా సంకల్పించారని అన్నారు. 2024 ఆగస్టు 23న రాష్ట్రవ్యాప్తంగా 13226 గ్రామాల్లో ఒకేసారి గ్రామసభలు పెట్టి గిన్నిస్ రికార్డు నెలకొల్పిన ఘనత పవన్‌ది సీఎం చంద్రబాబు వివరించారు. 7 వేల కి.మీ. మేర సీసీ రోడ్లు, 40 వేల గోకులాలు, 15,500 నీటితొట్టెలు నిర్మించారన్నారు. కొండ ప్రాంతాలు, గిరిజన ప్రాంతాల్లో రోడ్లు వేసిన ఘనత పవన్‌కల్యాణ్‌దని సీఎం గుర్తుచేశారు. రాయలసీమ - రతనాల సీమగా: కోడూరు-వెంకటగిరి రోడ్డును పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. బస్టాండ్ ఏర్పాటు ఆమోదం తెలిపారు. హార్టీకల్చర్ హబ్‌కు మదనపల్లెలో త్వరలోనే పునాది వేస్తున్నట్లు స్పష్టం చేశారు. గాలేరు-నగరి కాల్వ కోడూరుకు తీసుకొచ్చే బాధ్యత మాదని సీఎం భరోసా ఇచ్చారు. జలధార ద్వారా భూగర్భ జలాలను పెంచుకునేలా సంకల్పించామన్నారు. గోదావరి పుష్కరాల కంటే ముందే పోలవరం పూర్తి చేస్తామని చంద్రబాబు అన్నారు. విశాఖకు రైల్వే జోన్ సాధించామని ఉత్తరాంధ్రకు గూగుల్ డేటా సెంటర్ వస్తోందన్నారు. రాయలసీమను రతనాల సీమగా మారుస్తామని తెలిపారు. నరేగాలో 90-10 శాతం ఉండేదని, ఇప్పుడు రాష్ట్ర వాటా 40 శాతం ఉందని గడిచిన ప్రభుత్వ హయాంలో నిధులన్నీ దారి మళ్లించారని సీఎం ధ్వజమెత్తారు. రాష్ట్రంలో గొడ్డలి పార్టీ ఉంది జాగ్రత్తగా ఉండాలని సీఎం ప్రజలకు సూచించారు. ఆ పార్టీ 'రోజుకో మాట మాట్లాడుతోంది. గతంలో మూడు ముక్కలాట ఆడారు. ఎన్నికలు అయిపోయాక మావిగన్ అంటున్నారు. మన రాజధాని అమరావతే అది దేవతల రాజధాని. అమరావతి రాజధానికి కేంద్రం సహకరిస్తోంది' అని చంద్రబాబు నాయుడు అన్నారు. గత ప్రభుత్వ పాలనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గత పాలకులు నిర్వీర్యం చేసిన 93 కేంద్ర పథకాలను తాము అధికారంలోకి రాగానే పునరుద్ధరించామని ఆయన తెలిపారు. జల్ జీవన్ మిషన్ సహా వివిధ పథకాలకు రూ. 28 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. అమరావతి రాజధాని నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని అమరావతిని ఆపడం ఎవరి తరమూ కాదని తేల్చి చెప్పారు. గొడ్డలి పార్టీ రోజుకో మాట మాట్లాడుతోందని వైఎస్సార్సీపీపై విరుచుకుపడ్డారు. విధ్వంసమైన రాష్ట్రాన్ని నిలబెడతామని చెప్పి రెండేళ్లలోనే మాట నిలుపుకున్నామన్నారు. గొడ్డలి పార్టీ ఎన్నికల ముందు ఓ మాట, అయ్యాక మరో మాట మాట్లాడుతోందని ఇప్పుడు మావిగన్ అంటూ కొత్త పాట పాడుతున్నారని ఎద్దేవా చేశారు.

## 'పరస్పర విశ్వాసమే అతిపెద్ద వ్యూహాత్మక ఆస్తి'

**మొదటిపేజీ తరువాయి -** సమావేశం కోసం భారత్‌కు విచ్చేసిన నా చెల్లెలు, జపాన్ ప్రధాని సనాయె తకాయిచికి స్వాగతం పలుకుతున్నా. ఆమె జపాన్ మొట్టమొదటి మహిళా ప్రధాని, అలాగే దూరదృష్టి కలిగిన, ప్రజాదరణ పొందిన నాయకురాలు. ఆమె జపాన్‌లోని నారా ప్రిఫెక్చర్‌కు చెందినవారు. ఆ ప్రాంతం భారత్, జపాన్ మధ్య ఉన్న ఉమ్మడి బౌద్ధ వారసత్వానికి ఒక కీలక కేంద్రంగా ఉంది. కొద్ది రోజుల క్రితం జరిగిన +7 శిఖరాగ్ర సమావేశంలో, ప్రపంచ సంక్షోభ సమయంలో పరస్పర విశ్వాసమే మన అత్యంత విలువైన వ్యూహాత్మక ఆస్తి అని నేను చెప్పాను. గత కొన్ని దశాబ్దాలుగా, ఆటోమొబైల్ నుంచి ఎలక్ట్రానిక్స్ వరకు వివిధ రంగాల్లో భారత్‌కు సహకారం అందించడంలో జపాన్ కీలక పాత్ర పోషిస్తోంది. నేడు, ప్రధాని పర్యటనతో ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యంలో మేం ఒక కొత్త అధ్యాయాన్ని ప్రారంభిస్తున్నాం. భారత్- జపాన్ దేశాల మధ్య పెట్టుబడి భాగస్వామ్యం క్రమంగా బలపడుతోందని మోదీ పేర్కొన్నారు. గడిచిన ఏడాది కాలంలో సుమారు 120 కొత్త వ్యాపార ఒప్పందాలు కుదిరాయని, వీటి ద్వారా 10 బిలియన్ డాలర్లకు పైగా జపాన్ పెట్టుబడులు భారతదేశానికి రానున్నాయని ఆయన స్పష్టం చేశారు. ఫైనాన్షియల్ సర్వీసెస్ ఏజెన్సీల మధ్య కుదిరిన ఒప్పందం, మూలధనం, పెట్టుబడుల ప్రవాహాన్ని మరింత సులభతరం చేస్తుందని అభిప్రాయపడ్డారు. అలాగే, ఫార్మాస్యూటికల్స్, వైద్య పరికరాలు, బయోటెక్నాలజీ రంగాల్లో కుదిరిన ఒప్పందాల ద్వారా, ప్రపంచ ఆరోగ్య భద్రతకు కూడా దోహదం చేస్తాయని తెలిపారు. తమ టార్గెట్, జపాన్ నుంచి భారత్‌కు 10 ట్రిలియన్‌ల పెట్టుబడులను ఆకర్షించడం, రానున్న దశాబ్ద కాలంలో దేశంలో పనిచేస్తున్న జపాన్ కంపెనీల సంఖ్యను రెట్టింపు చేయడమేనని స్పష్టం చేశారు. ఇక, దేశంలో నిరంతరంగా జరుగుతున్న సంస్కరణలు వ్యాపారం చేసే సౌలభ్యాన్ని మెరుగుపరిచాయని, ఈ అవకాశాన్ని జపాన్ కంపెనీలు కూడా సద్వినియోగం చేసుకోవచ్చునని మోదీ అభిప్రాయపడ్డారు. మరోవైపు, ఆర్థిక భద్రత కోసం ఉమ్మడి రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసినట్లు మోదీ పేర్కొన్నారు. "ఆర్థిక భద్రత కోసం మేమిప్పుడు ఒక ఉమ్మడి రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేశాం. దీని ద్వారా, సెమీకండక్టర్లు, క్వాంటం టెక్నాలజీ, అధునాతన మెటీరియల్స్ వంటి వ్యూహాత్మక రంగాల్లో సరఫరా గొలుసు స్థితిస్థాపకతను బలోపేతం చేస్తాం. అలాగే, నేటి అనిశ్చిత యుగంలో, ఆర్థిక, ఇంధన భద్రత ప్రాముఖ్యతను భారత్, జపాన్ దేశాలు పూర్తిగా అర్థం చేసుకున్నాయి. దీనిపై కూడా మేం కీలక నిర్ణయాలు తీసుకున్నాం. దేశం అంతటా 1000 బయోగ్యాస్, సేంద్రియ ఎరువుల ప్లాంట్లను స్థాపించడంలో భారత్-జపాన్ బయోగ్యాస్ చొరవ మాకు సహాయపడుతుంది. ఇది మా 'గోబర్ధన్' చొరవను మరింత బలోపేతం చేస్తుంది. గ్రామాల్లో సుస్థిరత, శ్రేయస్సు, గ్రామీణ జీవనోపాధికి కొత్త ఊపునిస్తుంది" అని మోదీ పేర్కొన్నారు.

## అంటార్కిటికాలో 'రక్త జలపాతం'

**మొదటిపేజీ తరువాయి -** ప్రపంచంలోనే అత్యంత చల్లని ఖండమైన అంటార్కిటికాలో ఓ జలపాతం రక్తంలా ఎర్రగా ప్రవహిస్తూ అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. దాన్ని చూసినవారికి నిజంగానే మంచు కొండల నుంచి రక్తం కారుతున్నట్టే అనిపిస్తుంది. అయితే అది రక్తం కాదు. శతాబ్దకాలంగా శాస్త్రవేత్తలను వేధించిన ఈ రహస్యానికి తాజాగా సమాధానం లభించింది.

### అసలు రహస్యం ఇదే

అంటార్కిటికాలోని టేలర్ గ్లేసియర్ నుంచి ప్రవహించే ఈ జలపాతాన్ని 'బ్లడ్ ఫాల్స్' అని పిలుస్తారు. దీని ఎరుపు రంగుకు కారణం ఇనుము అధికంగా ఉన్న అత్యంత ఉప్పునీరు. మంచు అడుగున ఉన్న ఈ నీరు బయటకు వచ్చిన వెంటనే గాలిలోని ఆక్సిజన్‌తో ప్రతిచర్య జరిపి తుప్పు రంగులోకి మారుతుంది. అందుకే ఈ జలపాతం రక్తంలా ఎర్రగా కనిపిస్తుంది.

### 15 లక్షల ఏళ్ల నాటి సరస్సు

ఈ నీటి మూలం టేలర్ గ్లేసియర్ కింద సుమారు 400 మీటర్ల లోతులో ఉన్న పురాతన సరస్సు. దాదాపు 15 లక్షల సంవత్సరాల క్రితం సముద్రపు నీరు మంచు కింద చిక్కుకుపోయి, కాలక్రమంలో మరింత ఉప్పుగా మారిందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఉప్పు శాతం చాలా ఎక్కువగా ఉండటంతో తీవ్ర చలిలో కూడా ఈ నీరు గడ్డకట్టకుండా ద్రవరూపంలోనే ఉంటుంది. 1911లో ఆస్ట్రేలియా భూగర్భ శాస్త్రవేత్త గ్రిఫిత్ టేలర్ ఈ జలపాతాన్ని తొలిసారి గుర్తించారు. అప్పట్లో ఎరుపు రంగుకు ఆల్గే కారణమని భావించారు. కానీ తర్వాతి పరిశోధనల్లో అది తప్పని తేలింది. 2017లో అలాస్కా విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు రాడార్ సాయంతో గ్లేసియర్‌లోని రహస్య మార్గాలను గుర్తించారు. ఒత్తిడికి గురైన ఉప్పునీరు ఆ మార్గాల గుండా పైకి వచ్చి బ్లడ్ ఫాల్స్‌గా బయటపడుతుందని వెల్లడించారు. తాజాగా 'అంటార్కిటిక్ సైన్స్' జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయనం మరో కీలక విషయాన్ని బయటపెట్టింది. గ్లేసియర్‌లో ఏర్పడే చిన్న చిన్న పగుళ్ల ద్వారానే ఈ ఉప్పునీరు అప్పుడప్పుడు బయటకు వస్తోందని పరిశోధకులు గుర్తించారు. దీంతో శతాబ్దకాలంగా కొనసాగుతున్న ఈ ప్రకృతి రహస్యానికి మరింత స్పష్టత లభించింది.

### సూర్యకాంతి లేకుండానే జీవం

అంతకన్నా ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే ఈ ఉప్పునీటిలో సూర్యకాంతి, ఆక్సిజన్ లేకుండా లక్షల ఏళ్లుగా సూక్ష్మజీవులు జీవిస్తున్నాయి. కాంతి లేకుండానే రసాయన చర్యల ద్వారా అవి జీవిస్తుండటం శాస్త్రవేత్తలను ఆశ్చర్యపరుస్తోంది. భూమి వెలుపల మంచుతో కప్పి ఉన్న గ్రహాలు, ఉపగ్రహాలపై కూడా ఇలాంటి పరిస్థితుల్లో జీవం ఉండే అవకాశాలను అర్థం చేసుకోవడంలో ఈ పరిశోధన కీలకంగా మారుతుందని నిపుణులు చెబుతున్నారు.

## అమర్‌నాథ్ యాత్ర తొలి బృందానికి చందర్‌కోట్‌లో ఘన స్వాగతం

**మొదటిపేజీ తరువాయి -** సంస్థలు కలిసి యాత్రికులకు శుభాకాంక్షలు తెలిపి, వారి యాత్ర ప్రశాంతంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీఐజీ (డీకేఆర్ రేంజ్) సర్గున్ శుక్లా, రాంబన్ డిప్యూటీ కమిషనర్ మహ్మద్ అలియాస్ ఖాన్, ఎస్ఎస్పీ అరుణ్ గుప్తా, ఎస్ఎస్పీ ట్రాఫిక్ రాజా ఆదిల్ హమీద్‌తో పాటు పలువురు సీనియర్ సివిల్, పోలీసు అధికారులు పాల్గొన్నారు. జమ్మూలోని భగవతి నగర్ బేస్ క్యాంప్ నుంచి లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా గురువారం ఉదయం యాత్రికుల కాన్వాయ్‌ను జెండా ఊపి ప్రారంభించిన తర్వాత, చందర్‌కోట్ వారికి మొదటి ప్రధాన విరామ కేంద్రంగా నిలిచింది. యాత్రికులకు ఆహారం, తాగునీరు, ఇతర అత్యవసర సేవలు అందించేందుకు ఇక్కడ అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. యాత్రికుల భద్రత, సంక్షేమం, ప్రయాణం సాఫీగా సాగేందుకు జిల్లా యంత్రాంగం విస్తృతమైన ఏర్పాట్లు చేసింది. పోలీసు, ఆర్మీ, సీఏపీఎఫ్, ట్రాఫిక్ పోలీసు, ఆరోగ్య శాఖ, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక సేవలు వంటి ఇతర ఏజెన్సీలతో సమన్వయం చేసుకుంటూ పటిష్ఠమైన చర్యలు తీసుకుంది. రాంబన్ జిల్లాకు ఉన్న ఆతిథ్య సంప్రదాయానికి ఈ స్వాగత కార్యక్రమం అద్దం పడుతోంది. దేశవ్యాప్తంగా తరలివచ్చే భక్తులకు ఈ వార్షిక యాత్రను ఒక మధురమైన అనుభూతిగా మార్చడంలో భాగస్వాములందరి సమష్టి నిబద్ధతను ఇది తెలియజేస్తోంది.

### యాత్ర నేపథ్యం.. వివరాలు

భారతదేశంలోని అత్యంత పవిత్రమైన పుణ్యక్షేత్ర యాత్రలలో శ్రీ అమర్‌నాథ్ యాత్ర ఒకటి. ప్రతి సంవత్సరం లక్షలాది మంది భక్తులు దక్షిణ కశ్మీర్‌లోని హిమాలయాల్లో సుమారు 3,880 మీటర్ల ఎత్తులో ఉన్న అమర్‌నాథ్ గుహను సందర్శిస్తారు. ఇక్కడ సహజంగా ఏర్పడిన మంచు శివలింగాన్ని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. ఈ మంచు లింగం శివుని ప్రతీకగా భక్తులు భావిస్తారు. ఈ ఏడాది 57 రోజుల పాటు కొనసాగే ఈ యాత్ర జులై 3న అధికారికంగా ప్రారంభమై, రక్షా బంధన్ పర్వదినం రోజున అంటే ఆగస్టు 28న ముగుస్తుంది. అనంతనాగ్ జిల్లాలోని సంప్రదాయ 48 కిలోమీటర్ల నున్వాన్-పహల్గామ్ మార్గం, అలాగే గందర్‌బల్ జిల్లాలోని తక్కువ దూరంతో నిటారుగా ఉండే 14 కిలోమీటర్ల బల్తాల్ మార్గం ద్వారా ఏకకాలంలో యాత్ర కొనసాగుతుంది. యాత్రను విజయవంతంగా నిర్వహించేందుకు జమ్మూకశ్మీర్ వ్యాప్తంగా ఆన్‌స్పాట్ రిజిస్ట్రేషన్, ఆర్ఎఫ్ఐడీ కార్డుల జారీ, పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు, మౌలిక సదుపాయాల మెరుగుదల వంటి పనులను పూర్తి చేశారు. నివేదికల ప్రకారం, ఈ యాత్ర కోసం ఇప్పటివరకు 3.5 లక్షల మందికి పైగా భక్తులు నమోదు చేసుకున్నారు. రద్దీని నియంత్రించేందుకు రోజువారీ యాత్రికుల సంఖ్యపై పరిమితులు విధించారు.

## చర్చకు పిలిచి మొహం చాటేశారు

**మొదటిపేజీ తరువాయి -** తెలంగాణలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య రాజకీయ పోరు తీవ్రరూపం దాల్చింది. గురుకుల పాఠశాలల టెండర్లు, రాష్ట్ర అప్పులపై బహిరంగ చర్చకు రావాలంటూ సవాల్ విసిరిన మంత్రి జూపల్లి కృష్ణారావు, తీరా సమయం వచ్చేసరికి వెనకడుగు వేశారని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం చర్చ కోసం తాము తెలంగాణ భవన్‌కు చేరుకున్నా, మంత్రి రాకపోవడంపై ఆయన మండిపడ్డారు. గురువారం హరీశ్ రావు, ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ సహా పలువురు బీఆర్ఎస్ నేతలు తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. అదే సమయంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ గన్ పార్క్ వద్ద ఉన్నారన్న సమాచారంతో వారు అక్కడికి వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే, పోలీసులు వారిని అడ్డుకుని అరెస్టు చేశారు. ఈ క్రమంలో పోలీసులకు, బీఆర్ఎస్ శ్రేణులకు మధ్య స్వల్ప తోపులాట, వాగ్వాదం చోటుచేసుకుంది. "చర్చకు రమ్మని సవాల్ విసిరింది వాళ్లే, తీరా మేము వస్తే పోలీసులను ప్రయోగించి అడ్డుకోవడం చూస్తుంటే, టెండర్లలో జరిగిన అవినీతి బయటపడుతుందనే భయంతోనే వారు పారిపోయారని స్పష్టమవుతోంది" అని హరీశ్ రావు ఆరోపించారు. రాష్ట్ర అప్పు రూ. 8 లక్షల కోట్ల నుంచి రూ. 7 లక్షల కోట్లకు ఎలా తగ్గిందో ప్రభుత్వం వివరణ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. మరోవైపు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ భవన్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు కోసం ఖాళీ కుర్చీ వేసి వేచి చూశారు. పోలీసుల చర్యను ఆయన తీవ్రంగా ఖండించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అప్పులపాలైందని, భారీ స్థాయిలో అవినీతి జరిగిందని కాంగ్రెస్ మంత్రులు ఆరోపిస్తున్న నేపథ్యంలో ఇరు పార్టీల నేతలు బహిరంగ చర్చకు సవాళ్లు విసురుకున్నారు.

## బోడుప్పల్‌లో ఉద్రిక్తత.. కల్వకుంట్ల కవిత అరెస్ట్

**మొదటిపేజీ తరువాయి -** కార్యక్రమం నిర్వహిస్తుండగా ఈ పరిణామం చోటుచేసుకుంది. కవితతో పాటు పలువురు తెలంగాణ జాగృతి నేతలు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారికి ఇళ్ల స్థలాలు ఇస్తామన్న హామీని ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం నెరవేర్చడం లేదని కవిత ఆరోపించారు. ఉప్పల్ భగాయత్ వంటి ప్రాంతాల్లో ఉద్యమకా రులకు భూములు కేటాయించడంలో ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని, ఇచ్చిన హామీలను విస్మరిస్తోందని ఆమె విమర్శించారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఆమె ఈ నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఆందోళన సందర్భంగా పోలీసులు, నిరసనకారుల మధ్య స్వల్ప వాగ్వాదం, తోపులాట చోటుచేస ుకున్నాయి. అనంతరం కవితను, ఇతర నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ అరెస్టుకు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.




www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లా


## వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చే విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించరాదు ఎస్ ఈ. కట్టా. వెంకటేశ్వర్లు



ఒంగోలు,**జూలై 02 .అక్షర టైమ్స్ :** ఒంగోలులోని విద్యుత్ భవన్లో ఏ.పీ.సీ.పీ.డీ.సీ.ఎల్. ఎస్. ఈ వెంకటేశ్వర్లు గురువారం ప్రకాశం జిల్లా విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల తో మరియు పీఎం సూర్య ఘర్ , సోలార్ వెండార్స్ తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యుత్ సరఫరా నాణ్యత, వినియోగదారుల ఫిర్యాదుల సత్వర పరిష్కారం, పి ఎం సూర్య ఘర్, పీఎం కుసుం పథకాల అమలులో పురోగతి ,వర్షాకాలానికి ముందస్తు సన్నద్ధత, విద్యుత్ భద్రత చర్యలు, ఆదాయ వసూళ్లు, పంపిణీ నష్టాల తగ్గింపు, పెండింగ్ పనుల పురోగతి తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల ప్రతిష్ఠాత్మక పథకాలైన పి ఎం సూర్య ఘర్ , పీఎం కుసుం పథకాల అమలులో పురోగతి సాధించాలని, ఇళ్లపైనా సోలార్ రూఫ్ టాప్ పనులు వేగవంతం చేస్తూ , నాణ్యతపైన కూడా దృష్టి సారించి త్వరగా పనులు పూర్తీ చేయాలి అని సోలార్ వెండార్స్కు తెలియజేశారు . అలాగే జిల్లాలో సోలార్ రూఫ్ టాప్ కనెక్షన్లు అధికంగా ఏర్పాటు చేయడం కోసం ప్రతి ఒక్క విద్యుత్ అధికారికి కృషి చేయాలని ఆదేశించారు. అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ అందరికీ అందించాలని దానికోసం ఫీడర్ పెట్రోలింగ్ చేసి లోపాలను సరి చేయాలని తద్వారా ప్రజలకు విద్యుత్ శాఖ పట్ల శాటిస్ఫాక్షన్ లెవెల్స్ పెరుగుతాయని తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, పరివర్తకాల పనితీరు, స్మార్ట్ మీటర్ల గురించి, విద్యుత్ శాఖ మీద ప్రజల అభిప్రాయం, నిరంతరాయ మరియు నాణ్యమైన విద్యుత్ అందించడం కోసం తీసుకోవలసిన చర్యలు వాటి ప్రణాళికలు గురించి చర్చించారు. జిఐఎస్ మ్యాపింగ్, డి టి ఆర్ మ్యాపింగ్ అన్ని 33ఖ౦ ,11ఖ౦ ఫీడర్లు మరియు ట్రాన్స్ఫార్మర్కు అనుసంధానమైన సర్వీసుల వివరములు అన్నియు ఆన్లైన్ లో పొందుపరచడం ద్వారా సత్వరమైన వినియోగదారుల సేవలు అందిచబడుటకు తగు ఆదేశాలు ఇవ్వటం జరిగినది .విద్యుత్ కలెక్షన్లు మరియు బకాయిలు మీద సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చే విషయంలో అధికారులు ఎవరూ నిర్లక్ష్యం వహించకుండా త్వరగా పనులు పూర్తి చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఈ ఈలు, ఎస్ ఏ ఓ, సోలార్ వెండార్స్ పాల్గొన్నారు.

### రామిరెడ్డి గృహప్రవేశ వేడుకలో

## పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తుముల



ద్దలూరు,**జూలై 02 .అక్షర టైమ్స్ :** గిద్దలూరు పట్టణంలోని ప్రశాంత్ నగర్లో ఈదుల వెంకట రామిరెడ్డి నూతన గృహప్రవేశ వేడుకకు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి మరియు సోదరుడు క్రిష్ణ కిశోర్ రెడ్డి హాజరై, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు నాయకులు, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు

## వివాహా శుభకార్యక్రమం లో పాల్గొన్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ



కురిచేడు,**జూలై 02 .అక్షర టైమ్స్ :** కురిచేడు మండలం, పడమర గంగవరం గ్రామం లో గురువారం దాసరి వెంకటేశ్వర్లు - వెంకట సుబ్బమ్మ ల కుమారుని వివాహా వేడుకల్లో దర్శి నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పాల్గొని వరుడు చి॥ సురేష్ ని ఆశీర్వదించి వివాహా శుభాకాంక్షలు తెలియజేసినారు. ఈ కార్యక్రమం లో కురిచేడు మండల టిడిపి అధ్యక్షులు పిడతల నేమిలయ్య, ఒంగోలు పార్లమెంట్ టిడిపి ఉపాధ్యక్షులు కాట్రాజు నాగరాజు, టిడిపి సీనియర్ నాయకులు మొగల్ మస్తాన్ వలి, కిలారి కోటయ్య, క్లస్టర్ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

## ఎల్ ఓ సి లను పంపిణీ చేసిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ





కురిచేడు,**జూలై 02 .అక్షర టైమ్స్ :** కురిచేడు మండలం, బోధనం పాడు గ్రామం లో " వికసిత్ భారత్ - గ్యారెంటీ ఫర్ రోజ్గార్ అండ్ అజీవిక మిషన్ - గ్రామీణ్ " పథకం వేదిక వద్ద ముఖ్యమంత్రి సహాయానిధి నుండి మంజూరైన నలుగురు లబ్దిదారులకు రూ. 18,54,845/- రూపాయల ఎల్ వో సి లను గురువారం దర్శి టిడిపి ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ చేతుల మీదుగా పంపిణీ చేశారు.

**లబ్ధిదారుల వివరాలు :**

1.వరికూటి హనుమంతరావు రూ. 1,52,119/- (గంగదొనకొండ - కురిచేడు మండలం ) 2.యర్రంశెట్టి పెద్ద ఏడుకొండలు రూ. 5,00,000/- (గంగదొనకొండ - కురిచేడు మండలం ) 3. వద్దిపాటి పెద్ద బ్రహ్మయ్య రూ. 5,02,726/- (పి.వెంకటాపురం - దొనకొండ మండలం ) 4. బొక్షం సాయి కుమార్ : రూ . 7,00,000/- (నూజిల్లపల్లి - ముండ్లమూరు మండలం ). ఈ కార్యక్రమం లో స్థానిక ప్రజా ప్రతినిధులు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

### వివాహా శుభకార్యక్రమం లో

## పాల్గొన్న డాక్టర్ కడియాల లలిత్ సాగర్



దర్శి,**జూలై 02 .అక్షర టైమ్స్ :**దర్శి మండలం, తూర్పు వీరాయపాలెం గ్రామం లో తానికొండ వెంకయ్య - అజిత ల కుమార్తె వివాహా వేడుకల్లో గురువారం దర్శి టిడిపి యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ పాల్గొని వధువు చి॥ ల॥ సౌ॥ వెంకట కోమలి ని ఆశీర్వదించి వివాహా శుభాకాంక్షలు తెలియజేసినారు. వారితో పాటు తూర్పు వీరాయపాలెం గ్రామ టిడిపి నాయకులు, లాయర్ రవిద్ర తదితరులు ఉన్నారు.

## పని చేయనప్పుడు మీకు ఉద్యోగం ఎందుకు..? జీతం ఎందుకు..?

**ప్రభుత్వ కార్యాలయం అంటే సత్రం అనుకుంటున్నారా..?**

**పద్ధతి మార్చుకోండి..! లేదా ఉద్యోగానికి**

**వి.ఆర్.ఎస్. పెట్టి వెళ్లిపోండి !**

**అంతే తప్ప నిర్లక్ష్యంగా ఉంటే ఊరుకునే ప్రసక్తే లేదు**

**జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు స్పష్టం చేశారు.**





ఒంగోలు,**జూలై 02 .అక్షర టైమ్స్ :** ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని అన్ని విభాగాలను గురువారం జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి ఉద్యోగి జాబ్ చార్ట్ పై ఆరా తీసి వారు చేస్తున్న పనిని ప్రత్యక్షంగా పరిశీలించారు. విధుల నిర్వహణలో కొందరు సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండటంపై కలెక్టర్ ఈ సందర్భంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పద్ధతి, పనితీరు మార్చుకోకపోతే ఇకనుంచి ఉద్యోగం చేయాల్సిన అవసరం ఉండదని హెచ్చరించారు. సుమారు గంటన్నర పాటు కార్పొరేషన్ లోని ప్రతి గదినీ తనిఖీ చేసి సంబంధిత ఫైళ్లను పరిశీలించారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని అధికారులకు ఆయన స్పష్టం చేశారు. టౌన్ ప్లానింగ్ విభాగంలోని సిబ్బందిని మార్చాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. పని అవసరాలను గుర్తించి సిబ్బందిని రేషనలైజ్ చేయాలన్నారు. పారిశుద్ధ్యం కాకుండా ఇతర విభాగాలలో అవుట్ సోర్స్ ప్రాతిపదికన పనిచేస్తున్న సిబ్బంది వివరాలను తనకు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ లోని సిబ్బంది తమకు ఫోన్ చేసే ప్రజలతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలని కలెక్టర్ చెప్పారు. ప్రజలు ప్రస్తావించిన సమస్యలకు పరిష్కారంపైనా తిరిగి వారితో మాట్లాడి ఆరా తీయాలని సిబ్బందిని ఆదేశించారు. మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది అందరూ బయోమెట్రిక్ హాజరు వేయాలని, విధుల నిమిత్తం బయటకు వెళ్లేటప్పుడు మూమెంట్ రిజిస్టర్ లో కచ్చితంగా సంతకం చేసేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ కు చెప్పారు. కార్పొరేషన్ ప్రాంగణంలోనూ, కార్యాలయంలో కూడా సిసి కెమెరాలు పూర్తి స్థాయిలో పెట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

**అందరూ ఫీల్డ్ లో ఉండాలి....**

పారిశుద్ధ్య కార్మికులు అందరూ కచ్చితంగా వేకువజామునే ఫీల్డ్ లో విధులు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. పారిశుద్ధ్యము, త్రాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. ' ఆపరేషన్ క్లీన్ స్వీప్ ' మరో వారం రోజులు ఉన్నందున నగరం మొత్తం పారిశుద్ధ్య కార్యకలాపాలను ఉధృతం చేయాలన్నారు. నగర ప్రజలు తమ సమస్యలను మున్సిపాలిటీ దృష్టికి తీసుకువచ్చేందుకు ఏర్పాటు చేసిన 18004252381 టోల్ ఫ్రీ నంబర్ గురించి విస్తృత ప్రచారం కల్పించాలన్నారు.

**ప్రతివారం వస్తా... పురోగతి ఉండాలి**

నగర పరిధిలోని ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతి గురువారం ఉదయం 11 గంటలకు మున్సిపాలిటీలో ప్రత్యేకంగా ' మీకోసం ' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా గురువారం కార్పొరేషన్ లోని స్పెషల్ ఆఫీసర్ చాంబర్ వద్దకు వచ్చిన ప్రజల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. వాటి పరిష్కారానికి చర్యలు అధికారులను ఆదేశించారు. అర్జీల పరిష్కారం, ప్రజలకు సేవలు అందించడంలో ప్రతివారం నాణ్యత మరింత మెరుగుపడాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

**పోతురాజుపై ప్రత్యేక దృష్టి**

గత ఏడాది మొంథా తుఫాను సమయంలో తలెత్తిన పరిస్థితి పునరావృతం కాకుండా పోతురాజు కాలువపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. పూడికతీతతో పాటు కాలువగట్లపై ఆక్రమణలు తొలగిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. మున్సిపల్ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించారు. నగరంలోని ఖాళీ మున్సిపల్ స్థలాలను పి.పి.పి. పద్ధతిలో అభివృద్ధి చేస్తామన్నారు. షాపింగ్ కాంప్లెక్స్ లు, హోటళ్ళు నిర్మించేందుకు ముందుకు వచ్చే వారికి కేటాయిస్తామన్నారు. నగరంలోని రోడ్ల వెంట ఫుట్ పాత్ కూడా అభివృద్ధి చేస్తామని కలెక్టర్ తెలిపారు. 150 ఏళ్ల చరిత్ర కలిగిన ఒంగోలు నగరాన్ని క్లీన్ సిటీగా మారుస్తామని చెప్పారు. జిల్లాకు లక్షల కోట్ల రూపాయలలో పెట్టుబడును వస్తున్నందున ఆయా కంపెనీలకు సమీపంలో ఉన్న ఒంగోలు నగరాన్ని భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి చేయబోతున్నట్లు వివరించారు. ఈ విషయంలో ప్రజలు కూడా అధికార యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంట కమిషనర్ వెంకట కృష్ణయ్య, డీ.ఈ.ఈ. పద్మజ, ఎంహెచ్ఓ వైష్ణవి, ఇతర అధికారులు ఉన్నారు.

### " వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్గార్ అండ్ అజీవిక మిషన్

## గ్రామీణ్ " పథకాన్ని లాంఛనంగా ప్రారంభించిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ





దర్శి,**జూలై 02 .అక్షర టైమ్స్ :** " వికసిత్ భారత్ - గ్యారెంటీ ఫర్ రోజ్గార్ అండ్ అజీవిక మిషన్ - గ్రామీణ్ " పథకాన్ని దర్శి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ దర్శి నియోజకవర్గం, కురిచేడు మండలం, బోధనం పాడు గ్రామం లో గురువారం అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం - రాష్ట్ర ప్రభుత్వ సమన్వయంతో అమలు చేస్తున్న విక్షత్ భారత్ - రోజ్గార్ మరియు ఆజీవికా మిషన్ (గ్రామీణ్) హామీ ళివిబి-జి రామ్ జిరి గ్రామీణాభివృద్ధికి నూతన దిశను చూపించే ప్రతిష్ఠాత్మక కార్యక్రమమని అన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, జీవనోపాధి అవకాశాల పెంపు, సంక్షేమ కార్యక్రమాల విస్తరణ, నీటి సంరక్షణ, గ్రామీణ రహదారులు, సామూహిక ఆస్తుల నిర్మాణం, పర్యావరణ పరిరక్షణ వంటి అభివృద్ధి కార్యక్రమాలకు ఈ అభియాన్ ద్వారా మరింత వేగం చేకూరుతుందని తెలిపారు. అర్హులైన గ్రామీణ కుటుంబాలకు సంవత్సరానికి 125 రోజుల ఉపాధి హామీ కల్పించడంతో పాటు, గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో ప్రజల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధి కార్యాచరణ ప్రణాళికలను రూపొందించి, కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ప్రతి గ్రామాన్ని స్వావలంబన దిశగా తీసుకెళ్లడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని వివరించారు. "వికసిత్ భారత్ ఏ2047" లక్ష్య సాధనలో ప్రతి గ్రామం అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని పేర్కొంటూ, గ్రామస్థులు, రైతులు, మహిళా సంఘాలు, యువత ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విక్షత్ భారత్ - రోజ్గార్ మరియు ఆజీవికా మిషన్ (గ్రామీణ్) హామీ ళివిబి-జి రామ్ జిరి ప్రారంభోత్సవం లో ఉపాధి హామీ పనుల్లో కార్మికులతో కలిసి గొట్టిపాటి లక్ష్మీ పని చేసినారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా గ్రామంలో చేపట్టిన ఉపాధి హామీ పనులను ప్రారంభించి, అక్కడ పనులు చేస్తున్న కార్మికులతో కలిసి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ స్వయంగా పనులు చేశారు.



కార్మికులతో ఆత్మీయంగా ముచ్చటిస్తూ వారి సమస్యలు తెలుసుకుని, ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం బోధనంపాడు గ్రామ సచివాలయం లో నిర్వహించిన " విక్షత్ భారత్ - రోజ్గార్ మరియు ఆజీవికా మిషన్ (గ్రామీణ్) హామీ ళివిబి-జి రామ్ జిరి " కార్యక్రమంలో పాల్గొని రాష్ట్ర స్థాయిలో తిరుపతి జిల్లా లోని రైల్వే కోడూరులోనిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులతో కలిసి ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించినారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో మండల ఎంపీడీఓ, పంచాయతీ సెక్రెటరీ, మండల టిడిపి అధ్యక్షులు పిడతల నేమిలయ్య, ఒంగోలు పార్లమెంట్ టిడిపి ఉపాధ్యక్షులు కాట్రాజు నాగరాజు, దర్శి టౌన్ టిడిపి అధ్యక్షులు చిన్న, పుల్లలచెరువు రామాంజి, గ్రామ టిడిపి అధ్యక్షులు వేమా నాగరాజు, మాజీ ప్రెసిడెంట్ ఆకుల కోటయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ వేమా శ్రీను, చిన్ని నాగేశ్వరావు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, గ్రామ పంచాయతీ ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, రైతులు, ఉపాధి హామీ కార్మికులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## వీబీ జీ రామ్ జీ పనులను ప్రారంభించిన ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి,జ్యోతుల పెదబాబు

**జె అన్నవరంలో ఎమ్మెల్యే సత్యప్రభ సూచనలతో ఫీల్డ్**

**ఛానల్ పనులకు శ్రీకారం**

**125 రోజుల వేతన ఉపాధి,సమయానికి వేతన**

**చెల్లింపే పథకం ప్రధాన లక్ష్యం**



ఏలేశ్వరం,**జూలై 02 .అక్షర టైమ్స్ :**దకాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం జె అన్నవరం గ్రామంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న 'వికసిత్ భారత్ గ్యారంటీ రోజ్గార్ ఆజీవికా మిషన్ గ్రామీణ్ (వీబీజీరామ్‌జీ)' పథకాన్ని గురువారం ఘనంగా ప్రారంభించారు.ఏపీవో సురేష్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సూచనలతో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, టీడీపీ మండల అధ్యక్షుడు జ్యోతుల పెద్దబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో చేపట్టనున్న ఫీల్డ్ చానల్ పనులకు ప్రత్యేక పూజలు నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం వీబీ జీ రామ్ జీ పథక పోస్టర్‌ను ఆవిష్కరించి,పథకం ముఖ్యాంశాలను ఉపాధి కార్మికులకు వివరించారు.ఈ సందర్భంగా ఎంపీపీ బుజ్జి మాట్లాడుతూ గ్రామీణ శ్రామికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని గతంలోని ఉపాధి హామీ పథకానికి బదులుగా 'వికసిత్ భారత్‌రామ్‌జీ' పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. ఈ పథకం ద్వారా ఏడాదికి 125 రోజుల వేతన ఉపాధి కల్పించడంతో పాటు, వ్యవసాయ పనులు లేని సమయంలో కూడా శ్రామికులకు ఉపాధి లభించేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. గ్రామాల్లో గ్రావెల్ రోడ్లు, అంగన్‌వాడీ భవనాలు, కాలువల నిర్మాణం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులకు ఈ పథకం దోహదపడుతుందన్నారు. అలాగే గ్రామసభల ద్వారా రూపొందించే వికసిత్ గ్రామ పంచాయత్ ప్రణాళిక అమలుతో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయం చేస్తారని వివరించారు.నిర్ణీత గడువులో వేతనాల చెల్లింపు,ఆలస్యమైతే పరిహారం చెల్లించే విధానం ఈ పథక ప్రత్యేకత అని పేర్కొన్నారు.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పారదర్శక పరిపాలన అందిస్తూ గ్రామీణాభివృద్దే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామరాజు వర్మ, ఏపీవో సురేష్‌బాబు, ఎంపీటీసీ కాలారి గిరీష్, నాయకులు మద్దిపాటి అలర్కరాజు, భాజంకి కన్నారావు, చిక్కాల లక్ష్మణరావు, బుజ్జిరాజు, పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు, ఉపాధి కార్మికులు పాల్గొన్నారు.

www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
గ్రేటర్ హైదరాబాద్, ఈస్ట్ గోదావరి,
కాకినాడ జిల్లా, వెస్ట్ గోదావరి, ఏలూరు జిల్లా

# జె అన్నవరంలో నూతన పీహెచ్‌సీ భవనాన్ని పరిశీలించిన ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

**నిర్మాణ పనులపై సంతృప్తి వ్యక్తం చేసిన ఎంపీపీ**

**ఎమ్మెల్యే సత్యప్రభ కృషితో త్వరితగతిన పీహెచ్‌సీ పనులు**

**డాక్టర్లు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచన**





ఏలేశ్వరం,**జూలై 02.అక్షర టైమ్స్ :** కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం జె అన్నవరం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) భవనాన్ని మండల పరిషత్ అధ్యక్షుడు గొల్లపల్లి నరసింహమూర్తి (బుజ్జి) పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయనకు డాక్టర్ బి జయరాం, డాక్టర్ జి నాగలక్ష్మి సాలువాతో సత్కరించారు.ముందుగా అద్దె భవనంలో కొనసాగుతున్న పీహెచ్‌సీ సేవలను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించిన ఎంపీపీ బుజ్జి,వైద్యులు ప్రజలకు, రోగులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా సేవలందించాలని సూచించారు.అనంతరం గ్రామంలో నిర్మాణంలో ఉన్న నూతన పీహెచ్‌సీ భవనాన్ని పరిశీలించి,పనుల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ చొరవతో ఆసుపత్రి నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు.ఇప్పటికే సుమారు 70 శాతం పనులు పూర్తయ్యాయని,మిగిలిన పనులు కూడా త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు.అద్దె భవనంలో కొనసాగుతున్న పీహెచ్‌సీకి అవసరమైన పలు మౌలిక సదుపాయాలను వైద్యులు కోరిన మేరకు సమకూర్చినట్లు తెలిపారు.వాటిని త్వరలోనే స్థానిక ఎమ్మెల్యే చేతుల మీదుగా అధికారికంగా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామరాజు వర్మ,నాయకులు భజంకి కన్నారావు, మందపాటి అరకరాజు, చిక్కాల లక్ష్మణరావు, బుజ్జిరాజు, కాలారి సత్తిబాబు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# వైద్య వృత్తికి వందనం.. సేవామూర్తులకు ఘన సత్కారం



కాప్రా,**జూలై 02.అక్షర టైమ్స్ :** ప్రతినిధి గోపగాని పాండు ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం తమ వ్యక్తిగత జీవితాన్ని సైతం పక్కనపెట్టి నిరంతరం సేవలందిస్తున్న వైద్యుల సేవలను గుర్తిస్తూ ఇంటర్నేషనల్ డాక్టర్స్ డే సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సేవాదళ్ ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కాప్రా పరిధిలోని ఈసీఐఎల్ క్రాస్ రోడ్డులో ఉన్న సూర్య హాస్పిటల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ జగదీష్ బాబు, డాక్టర్ శ్రీ చంద్ర, డాక్టర్ వెంకటేష్, డాక్టర్ ఖయూమ్, డాక్టర్ నిషార్‌లను శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సత్కరించారు. వైద్యుల సేవలకు కృతజ్ఞతగా పుష్పగుచ్ఛాలు అందించి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సేవాదళ్ అధ్యక్షుడు నాగేంద్ర ప్రసాద్, కార్యదర్శి ఫణి భూషణ్ మాట్లాడుతూ.. వైద్య వృత్తి కేవలం ఉద్యోగం మాత్రమే కాదని, అది మానవత్వానికి ప్రతీక అయిన అత్యున్నత సేవ అని అన్నారు. ప్రాణాపాయ స్థితుల్లో ఉన్న రోగులకు పునర్జన్మ ప్రసాదించే వైద్యులు సమాజానికి నిజమైన దైవస్వరూపులని కొనియాడారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల ప్రాణాలను కాపాడేందుకు వైద్యులు చేసిన సేవలను సమాజం ఎన్నటికీ మరువలేదని పేర్కొన్నారు. సమాజంలో ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండేందుకు వైద్యులు నిత్యం అంకితభావంతో శ్రమిస్తున్నారని, వారి త్యాగం, నిబద్ధత, సేవాస్ఫూర్తిని గౌరవించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. వైద్యుల సేవలను గుర్తించి వారిని ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్తులో కూడా ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు, సేవా కార్యక్రమాలతో పాటు వైద్యులను సన్మానించే కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని వెల్లడించారు.సన్మానం అందుకున్న వైద్యులు మాట్లాడుతూ.. తమ సేవలను గుర్తించి సత్కరించడం ఆనందంగా ఉందని, ఈ గుర్తింపు తమ బాధ్యతను మరింత పెంచిందని అన్నారు. భవిష్యత్తులోనూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు మరింత అంకితభావంతో పనిచేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సేవాదళ్ కోశాధికారి నమ్ముల రమేష్ యాదవ్, డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ లయన్స్ కృష్ణవేణి, ఎఫ్‌డబ్ల్యూసీ లయన్ హేమలత, ఆసుపత్రి వైద్య సిబ్బంది, లయన్స్ క్లబ్ సభ్యులు, ప్రముఖులు తదితరులు పాల్గొని వైద్యులను అభినందించారు.

# సవాళ్లు విసిరి.. చర్చకు రాకుండా పారిపోతున్నారా.?

**కాంగ్రెస్ తీరుపై బీఆర్ఎస్ విమర్శల దాడి**






హైదరాబాద్,**జూలై 02.అక్షర టైమ్స్ :** ప్రతినిధి రిపోర్టింగ్ ఎం.వీరేష్ తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం 'సవాల్'ల పర్వం నడుస్తోంది. పాలక, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరుకోగా, ఇప్పుడు ఆ చర్చ 'పిరికిపంద' అనే పదం చుట్టూ తిరుగుతోంది. అభివృద్ధి, పాలనపై చర్చకు రావాలని సవాలు విసురుతున్న కాంగ్రెస్ నేతలు, తమకు ఎదురయ్యే ప్రశ్నలను ఎదుర్కోలేక తప్పించుకుంటున్నారని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతోంది.

**మాటల గారడీ.. చేతల్లో శూన్యం?**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, తన పాత ప్రత్యర్థి అయిన బీఆర్ఎస్‌ను లక్ష్యంగా చేసుకుని నిరంతరం విమర్శలు గుప్పిస్తోంది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నుండి మంత్రుల వరకు అందరూ 'ఓపెన్ డిబేట్'కు సిద్ధమని సవాళు విసురుతున్నారు. అయితే, బీఆర్ఎస్ నేతలు ఆ సవాలును స్వీకరించి చర్చకు వేదికలను ఖరారు చేస్తుంటే, కాంగ్రెస్ నేతలు మాత్రం వెనకడుగు వేస్తున్నారనేది ప్రధాన ఆరోపణ.

**రేవంత్ నుండి జూపల్లి వరకు.. ఇదేనా వ్యూహం?**

మొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన సవాలు, నేడు మంత్రి జూపల్లి కృష్ణారావు చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. తాము అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక, లేదా తమ వైఫల్యాలను ఎండగడతారనే భయంతో కాంగ్రెస్ నేతలు మైదానం నుండి పారిపోతున్నారని బీఆర్ఎస్ నేతలు విమర్శిస్తున్నారు. "సవాళ్లు విసరడం వరకే మీ పరిమితి. చర్చకు రాకుండా పారిపోవడంలోనే మీ పిరికితనం బయటపడుతోంది" అని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**భయం దేనికి?**

ప్రభుత్వ పనితీరుపై ప్రజాక్షేత్రంలో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇచ్చిన హామీల అమలు, సంక్షేమ పథకాల కోత, మరియు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై బీఆర్ఎస్ లేవనెత్తుతున్న ప్రశ్నలు కాంగ్రెస్ సర్కార్‌కు ఇబ్బందికరంగా మారాయి. అన్నీ సక్రమంగా ఉంటే.. చర్చకు భయమెందుకు? వాస్తవాలు బయటకు వస్తాయనే ఆందోళనలో ఉన్నారా? పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే ఈ పలాయనవాదమా? ఇలాంటి ప్రశ్నలు ఇప్పుడు సామాన్య ప్రజల నోట కూడా వినిపిస్తున్నాయి. ముగింపు రాజకీయాల్లో సవాళ్లు, ప్రతిసవాళ్లు సహజమే. కానీ, విసిరిన సవాలును నిలబెట్టుకోవడంలోనే నాయకుడికి ఉండే నిజమైన ధైర్యం తెలుస్తుంది. చర్చనుండి పారిపోవడం వల్ల సమస్య పరిష్కారం కాదు సదా, అది ప్రతిపక్షానికి మరింత రాజకీయ ఆయుధంగా మారుతుంది. ప్రజాస్వామ్యంలో వాదనల కంటే వాస్తవాలే ప్రధానం. మరి, కాంగ్రెస్ నేతలు ఈ 'భయం' వీడి, చర్చకు సిద్ధమవుతారా? లేక ఇలాగే 'పిరికిపంద' అనే ముద్రను మూటగట్టుకుంటారా.? అన్నది వేచి చూడాలి.

# వాన గండం.. నగరపాలక ముందస్తు వ్యూహం

**విపత్తులను ఢీకొట్టేందుకు ఉమ్మడి కార్యాచరణ బృందాలు సిద్ధం**

**ఒకే తాటిపైకి రక్షకభట శాఖ, హైడ్రా, జలమండలి, నగరపాలక సంస్థ, జాతీయ, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళాలు**

**గంట ముందే వర్షం హెచ్చరిక..సాంకేతికతను బలోపేతం చేయాలి**

**క్షేత్రస్థాయిలో అలసత్వం వహిస్తే సహించేది లేదు: నగరపాలక కమిషనర్**





శేర్లింగంపల్లి,**జూలై 02.అక్షర టైమ్స్ :** ప్రతినిధి రిపోర్టింగ్ ఎం.ఈరన్న వర్షాకాలంలో ఎదురయ్యే ఎలాంటి సవాళ్లనైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వివిధ ప్రభుత్వ విభాగాలు కలిసికట్టుగా పనిచేయాలని, పరస్పర సహకారంతో ముందుకు సాగాలని నగరపాలక సంస్థ కమిషనర్ పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర సమగ్ర విపత్తు నిర్వహణ, నియంత్రణ కేంద్రం ప్రతినిధులతో కలిసి ఉమ్మడి కార్యాచరణ బృందాల అవగాహన సదస్సును గురువారం ఘనంగా నిర్వహించారు. వర్షాకాలంలో తలెత్తే ముంపు సమస్యలు, ప్రజలకు కలిగే ఇబ్బందులను తొలగించడంపై ఈ సమావేశంలో విస్తృతంగా సమీక్షించారు. ఈ సదస్సులో నగరపాలక సంస్థలు, రక్షక భట నిలయం (పోలీస్ శాఖ), చెరువులు-నలభై అడుగుల రహదారుల పరిరక్షణ సంస్థ (హైడ్రా), జలమండలి, అగ్నిమాపక శాఖ, జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం, భారత వాతావరణ శాఖతో పాటు ఇతర కీలక ప్రభుత్వ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**నిపుణుల అవగాహన - క్షేత్రస్థాయి సమన్వయం**

పట్టణాల్లో ముంపు సమస్యలు, వాతావరణ అంచనాలు, రక్షణ-సహాయక చర్యలు, వాహనాల రాకపోకల నియంత్రణ, విపత్తు సమయాల్లో తక్షణ స్పందన మరియు ఉమ్మడి కార్యాచరణ బృందాల బాధ్యతలపై నిపుణులు సమగ్ర అవగాహన కల్పించారు. అన్ని ప్రభుత్వ విభాగాలు ఒకరితో ఒకరు సమాచారాన్ని పంచుకుంటూ, క్షేత్రస్థాయిలో సకాలంలో స్పందించి తగిన చర్యలు చేపట్టాలని కమిషనర్ స్పష్టం చేశారు.

**ప్రత్యేక వార్తా విభాగం: గంట ముందే వాన హెచ్చరిక!**


భారత వాతావరణ శాఖ ద్వారా గంట, రెండు గంటల ముందే ఏయే ప్రాంతాల్లో ఎంత వర్షం పడబోతోందనే ఖచ్చితమైన సమాచారాన్ని అందుకునేలా సాంకేతిక వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని కమిషనర్ ఆదేశించారు. దీనివల్ల ముందస్తు రక్షణ చర్యలు చేపట్టడం, ప్రజలను అప్రమత్తం చేయడం సులువవుతుందని పేర్కొన్నారు.

**ప్రణాళికాబద్ధమైన పనులతోనే శాశ్వత పరిష్కారం**

వర్షాకాలానికి సంబంధించిన పనులన్నింటినీ స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక లక్ష్యాలుగా విభజించి అమలు చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. తక్షణ సమస్యలను పరిష్కరిస్తూనే, వరద ముంపునకు శాశ్వత నివారణోపాయాలు కనుగొనడానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వర్షాకాలంలో విపత్తుల పట్ల అత్యంత వేగంగా స్పందించడం, ప్రజా నష్టాన్ని నివారించడం మరియు నగర ప్రజల భద్రతను కాపాడటమే ఈ ప్రత్యేక సదస్సు ముఖ్య ఉద్దేశమని కమిషనర్ వివరించారు.

# నేటి యువతకు స్ఫూర్తి మన బొడ్డేటి అప్పారావు

**పాటంశెట్టి సూర్యచంద్ర ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి**



గోకవరం,**జూలై 02.అక్షర టైమ్స్ :** మంచి సమాజం కోసం నిరంతరం శ్రమిస్తున్న కిర్లంపూడి మండలం, పాలెం గ్రామ నివాసి, క్రాంతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బొడ్డేటి అప్పారావు నేటి యువతకు ఆదర్శప్రాయుడని పాటంశెట్టి సూర్యచంద్ర కొనియాడారు బొడ్డేటి అప్పారావు జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయనను సూర్యచంద్ర ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ,అప్పారావు తన పుట్టినరోజున 28వ సారి రక్తదానం చేయడం ఆయన సామాజిక బాధ్యతకు, సేవానిరతికి నిదర్శనమని ప్రశంసించారు.ఒకవైపు సామాజిక సేవ చేస్తూనే, మరోవైపు ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆయన నిరంతరం తపన పడుతుంటారని పేర్కొన్నారు. గ్రామాల్లోని, మండలంలోని ప్రజా సమస్యలను స్వయంగా గుర్తించి, వాటి పరిష్కారం కోసం సంబంధిత ప్రభుత్వ అధికారుల వద్దకు వెళ్లి,సమస్యల తీవ్రతను వివరించి వాటిని పరిష్కరించే వరకు అప్పారావు చేసే నిరంతర ప్రయత్నాలు ఎంతో అభినందనీయమని సూర్యచంద్ర కొనియాడారు. సమాజ హితం కోరే ఇలాంటి వ్యక్తులను స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకు సాగాలని సూర్యచంద్ర కోరారు.

**చర్లపల్లి కాంగ్రెస్‌లో కొత్త జోష్..**

# ప్రభు గౌడ్‌కు నాయకత్వ పగ్గాలు





చర్లపల్లి,**జూలై 02.అక్షర టైమ్స్ :** ప్రతినిధి గోపగాని పాండు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా చర్లపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా బొడిగ ప్రభు గౌడ్ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్న పరిణామం చోటుచేసుకుంది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాజీ జీహెచ్ఎంసీ మేయర్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు బొంతు రామ్మోహన్, చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ దంపతులను కలిసి ఆశీర్వాదం తీసుకోవడం కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది.ఈ సందర్భంగా బొంతు దంపతులు మాట్లాడుతూ, పదవి అనేది హోదా మాత్రమే కాదని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే బాధ్యత అని పేర్కొన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలందరినీ ఒకే వేదికపై నడిపిస్తూ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని, ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుండి స్థానిక అభివృద్ధికి కృషి చేయాలని ప్రభు గౌడ్‌కు సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు.అనంతరం మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ మాట్లాడుతూ, చర్లపల్లి డివిజన్‌కు సమర్థ నాయకత్వాన్ని అందించాలనే ఉద్దేశంతో బొడిగ ప్రభు గౌడ్‌ను అధ్యక్షుడిగా నియమించిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, డీసీసీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, ఉప్పల్ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ నాయకత్వం ఉంచిన నమ్మకాన్ని ప్రభు గౌడ్ నిలబెట్టి, కాంగ్రెస్ జెండాను మరింత బలోపేతం చేస్తూ ప్రజా సేవలో ఆదర్శంగా నిలుస్తారని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు.

# హెచ్‌ఏఎల్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్.ఆర్ ఫ్లెక్స్ ప్రింటింగ్ స్టూడియో



శేరిలింగంపల్లి,**జూలై 02.అక్షర టైమ్స్ :** ప్రతినిధి రిపోర్టింగ్ ఎం.ఈరన్న శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని మస్జీద్ బండ డివిజన్ హెచ్‌ఏఎల్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్.ఆర్ ఫ్లెక్స్ ప్రింటింగ్ స్టూడియోను పటాన్చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్‌తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ఘనంగా ప్రారంభించారు.ప్రారంభోత్సవంలో భాగంగా ఆయన రిబ్బన్ కట్ చేసి, అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టూడియో నిర్వాహకులు మాజీ కార్పొరేటర్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం రాగం నాగేందర్ యాదవ్ ప్రింటింగ్ స్టూడియో యజమాన్యానికి, సిబ్బందికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యువత ఉద్యోగాల కోసమే ప్రాకులాడకుండా, ఇలా స్వయం ఉపాధి వైపు అడుగులు వేసి తోటి వారికి ఆదర్శంగా నిలవడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. స్థానిక ప్రజలు, వ్యాపారస్తులు ఇలాంటి నూతన స్టార్టప్‌లను, స్థానిక వ్యాపారాలను ప్రోత్సహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ వైభవంగా జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో నిర్వాహకులు విజయ్, సత్యనారాయణ, రవీంద్ర చారీ, మెట్టు కళ్యాణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## బండ్లగూడ రైల్వే బాధితులకు అండగా ఎంపీ రఘునందన్ రావు, మాజీ కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్



పటాన్చెరు,**జులై 02.అక్షర టైమ్స్ :** ప్రతినిధి ఎం.వీరేష్ పటాన్చెరు నియోజకవర్గం జేపీ కాలనీ డివిజన్ పరిధిలోని బండ్లగూడలో రైల్వే ట్రాక్ పనుల వల్ల ఇళ్లు కోల్పోయే ప్రమాదంలో ఉన్న నిరుపేదలకు మెదక్ ఎంపీ రఘునందన్ రావు, మాజీ కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ భరోసా ఇచ్చారు. గత నాలుగు నెలల క్రితం రైల్వే అధికారులు ట్రాక్ విస్తరణలో భాగంగా సమీపంలోని ఇళ్లకు నంబర్లు వేయడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. ఈ సమస్యపై మెట్టుకుమార్ యాదవ్ వందమంది స్థానికులతో కలిసి ఎంపీని కలిసి విన్నవించగా, ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ మేరకు బండ్లగూడలో పర్యటించిన ఎంపీ, మెట్టుకుమార్ యాదవ్‌తో కలిసి రైల్వే ట్రాక్ నిర్మాణ ప్రాంతాన్ని, ప్రభావితమయ్యే ఇళ్లను స్వయంగా పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ, పేదలకు అన్యాయం జరగకుండా రైల్వే అధికారులతో చర్చించి, వారికి సముచిత న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మెట్టుకుమార్ యాదవ్ మాట్లాడుతూ, ప్రజా సమస్యపై స్పందించి, బిజీ షెడ్యూల్‌లోనూ సమయం కేటాయించి క్షేత్రస్థాయిలో పర్యటించిన ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, బండ్లగూడ బీఆర్ఎస్ టౌన్ ప్రెసిడెంట్ భరత్, బీజేపీ నాయకులు రాజశేఖర్ రెడ్డి, కుమార్, మురళీధర్ వర్మ, గొల్ల కృష్ణ, అడ్వకేట్ విజయ్ రాజ్, లక్ష్మణ్ యాదవ్, సురేష్ రెడ్డి, గోపాల్, శ్రీశైలం, బిక్షపతి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## 38 కిలోమీటర్ల కాలినడక
## పోలియో చుక్కలు వేసేందుకు కొండలు దాటిన ఆరోగ్య సిబ్బంది

**జమ్మూకశ్మీర్‌లోని గురేజ్ పర్వత ప్రాంతంలో సంచార కుటుంబాలకు చేరిన వైద్య బృందం- 10 గంటలపాటు నడిచి దాదాపు 30 మంది చిన్నారులకు పోలియో చుక్కలు**



వైద్య సేవలు అందుబాటులో లేని ప్రాంతాల్లో ఒక్క చిన్నారి కూడా పోలియో టీకాకు దూరం కాకూడదనే సంకల్పంతో జమ్మూకశ్మీర్ ఆరోగ్య శాఖ సిబ్బంది విశేష కృషి చేసింది. బండిపోరా జిల్లాలోని గురేజ్ద లో జాతీయ పల్స్ పోలియో రోగనిరోధక కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య కార్యకర్తల బృందం దాదాపు 38 కిలోమీటర్లు కాలినడకన ప్రయాణించి సంచార కుటుంబాల చిన్నారులకు పోలియో చుక్కలు వేసింది. ఎండ, నిటారుగా ఉన్న పర్వత దారులు, రాతి భూభాగాలను దాటుతూ చేసిన ఈ ప్రయాణం ప్రస్తుతం అందరి ప్రశంసలు అందుకుంటోంది. వైద్య సామగ్రిని వీపుపై మోసుకుంటూ ప్రయాణం గురేజ్ ప్రాంతంలోని ఎత్తైన పర్వతాల్లో గుజ్జర్ , బకర్వాల్ తెగలకు చెందిన సంచార కుటుంబాలు తమ పశువులతో కలిసి నివసిస్తుంటాయి. ఈ ప్రాంతాలకు రహదారి సౌకర్యం లేకపోవడంతో పాటు వైద్య సేవలు కూడా చాలా అరుదుగా అందుబాటులో ఉంటాయి. దీంతో అక్కడి చిన్నారులకు పోలియో టీకాలు అందించేందుకు ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఆరోగ్య కార్యకర్తలు బషీర్ అహ్మద్ టెరూ, షమ్స్ దిన్ నాసిర్, ఆశా కార్యకర్త రుబీనా తదితరులు దావార్ ప్రాంతం నుంచి తమ ప్రయాణాన్ని ప్రారంభించారు. వ్యాక్సిన్ క్యారియర్లు, అవసరమైన మందులు, వైద్య సామగ్రిని వీపుపై మోసుకుంటూ పటల్వాన్ పర్వత ప్రాంతానికి కాలినడకన బయలుదేరారు. నిటారుగా ఉన్న కొండదారులు, రాళ్లతో నిండిన మార్గాలు దాటుకుంటూ దాదాపు 10 గంటలపాటు ప్రయాణించి సంచార కుటుంబాలు నివసిస్తున్న ప్రాంతానికి చేరుకున్నారు. ప్రాథమిక వైద్య సేవలు రాత్రంతా అక్కడే బస చేసిన వైద్య బృందం మరుసటి రోజు పోలియో కార్యక్రమాన్ని నిర్వహించింది. దాదాపు 30 మంది చిన్నారులకు నోటి ద్వారా పోలియో చుక్కలు వేసింది. అంతేకాకుండా అక్కడే తాత్కాలిక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి సంచార కుటుంబాలకు ప్రాథమిక వైద్య సేవలు అందించింది. రోగులను పరీక్షించి అవసరమైన మందులు పంపిణీ చేయడంతో పాటు సాధారణ ఆరోగ్య సమస్యలకు చికిత్స అందించింది. అనంతరం మళ్లీ కాలినడకనే తిరుగు ప్రయాణం ప్రారంభించి మొత్తం 38 కిలోమీటర్ల రౌండ్ ట్రిప్‌ను పూర్తి చేసింది. "తెల్లవారుజామునే బయలుదేరి సుమారు 10 గంటలపాటు నిరంతరాయంగా నడిచాం. పర్వత మార్గం ఎంతో కఠినంగా ఉన్నప్పటికీ అక్కడ చిన్నారులు తమ కోసం ఎదురుచూస్తున్నారని మాకు తెలుసు" – బషీర్ అహ్మద్ టెరూ, ఆరోగ్య కార్యకర్త ఆశా కార్యకర్త రుబీనా మాట్లాడుతూ, గుజ్జర్, బకర్వాల్ సంచార కుటుంబాలు ఎత్తైన ప్రాంతాల్లో నివసిస్తుండటంతో వారికి శాశ్వత చిరునామా ఉండదని చెప్పారు. అందువల్ల టీకాలు వేయించుకోవడానికి లేదా వైద్య చికిత్స కోసం వారు ఆరోగ్య కేంద్రాలకు రావడం చాలా కష్టమని వివరించారు. దాంతో వారు వస్తారని ఎదురు చూడకుండా, ఆరోగ్య సిబ్బందే వారి వద్దకు వెళ్లి సేవలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. వైద్య బృందం చేసిన ఈ సేవలకు సంచార కుటుంబాలు కృతజ్ఞతలు తెలిపాయి. విజయవంతంగా జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం అలాగే తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయడానికి, వైద్య పరీక్షలు నిర్వహించడానికి ఆరోగ్య సిబ్బంది ఇంత దూరం కాలినడకన వస్తారని ఊహించలేదని స్థానిక వృద్ధుడు అన్నారు. తమ కోసం చేసిన ఈ కృషిని ఎప్పటికీ మరిచిపోలేమని చెప్పారు. జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం కావాలంటే ప్రతి చిన్నారికి టీకా అందడం ముఖ్యం. అందుకే వైద్య సేవలు అందుబాటులో లేని మారుమూల ప్రాంతాలు, కొండలు, అడవులు, సంచార వర్గాలు నివసించే ప్రాంతాల్లోనూ ఆరోగ్య శాఖ ప్రత్యేక బృందాలను పంపిస్తోంది. గురేజ్‌లో ఆరోగ్య సిబ్బంది చేసిన ఈ 38 కిలోమీటర్ల పాదయాత్ర ప్రభుత్వ ఆరోగ్య సేవల పట్ల ఉన్న నిబద్ధతకు, ఆరోగ్య కార్యకర్తల సేవాభావానికి నిదర్శనంగా నిలిచింది.

## ఖమేనీ అంత్యక్రియలకు కొడుకు మొజ్తబా దూరమేనా?
## భారత్ లో ఇరాన్ ప్రతినిధి కీలక వ్యాఖ్యలు


అలీ ఖమేనీ అంత్యక్రియలకు మొజ్తబా ఖమేనీ హాజరు కావడం కష్టమేనన్న హకీమ్ ఎలాహీ- ఇజ్రాయెల్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో భద్రతా కారణాలే కారణమని వెల్లడి- వేలాది మంది సంతాపం తెలిపేందుకు టెహ్రాన్‌కు చేరుకుంటున్న ప్రముఖులు ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ అంత్యక్రియలకు ఆయన కుమారుడు మొజ్తబా ఖమేనీ హాజరయ్యే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయని భారత్ లోని సుప్రీం లీడర్ ప్రతినిధి అయతుల్లా హకీమ్ ఎలాహీ వెల్లడించారు. ప్రస్తుతం ఇజ్రాయెల్‌తో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా భద్రతాపరమైన ఆందోళనలు తీవ్రంగా ఉన్నాయని, అందువల్ల మొజ్తబా ఖమేనీని బహిరంగంగా బయటకు రావడానికి భద్రతా సంస్థలు అనుమతించడం లేదని ఆయన చెప్పారు. ఓ ప్రత్యేక ఇంటర్వ్యూలో అయతుల్లా హకీమ్ ఎలాహీ ఈ విషయాలను వెల్లడించారు. ఇటీవల తాను ఇరాన్‌కు వెళ్లిన సమయంలో మొజ్తబా ఖమేనీని కలిసిన కొందరు సన్నిహితులతో మాట్లాడినట్లు తెలిపారు. వారి సమాచారం ప్రకారం మొజ్తబా ఖమేనీ ప్రజలను కలవాలని, బయటకు రావాలని కోరుకుంటున్నప్పటికీ భద్రతా అధికారులు అందుకు అంగీకరించడం లేదని చెప్పారు. "ఆయన బయటకు రావాలని, ప్రజలను కలవాలని అనుకుంటున్నారు. కానీ భద్రతా పరిస్థితులు అందుకు అనుకూలంగా లేవు. ప్రస్తుతం ఆయనకు పూర్తి స్థాయి భద్రత కల్పించడం చాలా కష్టమని అధికారులు భావిస్తున్నారు. అందువల్ల ఆయన అంత్యక్రియలకు కూడా బహిరంగంగా హాజరయ్యే అవకాశం కనిపించడం లేదు" అని హకీమ్ ఎలాహీ పేర్కొన్నారు. అలీ ఖమేనీ మరణంతో ఇరాన్ అంతటా తీవ్ర విషాద వాతావరణం నెలకొందని ఆయన తెలిపారు. దేశ ప్రజలు తమ అత్యున్నత నాయకుడిని కోల్పోవడాన్ని తట్టుకోలేకపోతున్నారని చెప్పారు. ఆయన మరణాన్ని ఇరాన్ ప్రజలు కేవలం ఒక నాయకుడి మరణంగా కాకుండా తమ ఆత్మను, తమ స్ఫూర్తిని కోల్పోయినట్లుగా భావిస్తున్నారని వ్యాఖ్యానించారు. "ఇది వారికి చాలా పెద్ద నష్టం. తమ స్ఫూర్తిని, తమ ఆత్మను కోల్పోయినట్లుగా వారు భావిస్తున్నారు. అలీ ఖమేనీ స్థానాన్ని మరెవరూ భర్తీ చేయలేరనే అభిప్రాయం ప్రజల్లో బలంగా ఉంది" అని హకీమ్ ఎలాహీ తెలిపారు. అలీ ఖమేనీకి తుది వీడ్కోలు పలికేందుకు ప్రపంచంలోని పలు దేశాల నుంచి నాయకులు, మతపెద్దలు, వేలాది మంది ప్రజలు టెహ్రాన్‌కు చేరుకుంటున్నారని చెప్పారు.

## ఘనంగా డాక్టర్స్ డే మహిళా వైద్యులకు ప్రసాద్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘన సన్మానం

శేరిలింగంపల్లి,**జులై 02.అక్షర టైమ్స్ :** ప్రతినిధి ఎం.ఈరన్న సమాజంలో వైద్యుల పాత్ర ఎనలేనిదని, కనిపించని దేవుడి రూపాలే మన కళ్లముందున్న వైద్యులని ప్రసాద్స్ ఫౌండేషన్ ఫౌండర్ చైర్మన్ డి.ఎస్.ఆర్.కె. ప్రసాద్ కొనియాడారు. జాతీయ డాక్టర్స్ డే పురస్కరించుకుని ప్రసాద్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం శేరిలింగంపల్లిలో ప్రముఖ మహిళా వైద్యులకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఫౌండేషన్ ఫౌండర్ చైర్మన్ డి.ఎస్.ఆర్.కె. ప్రసాద్, వారి సతీమణి మరియు ఫౌండేషన్ డైరెక్టర్ దోనేపూడి రమాదేవి కలిసి ప్రముఖ వైద్యురాలు డాక్టర్ భార్గవి చౌదరి ఆరెకపూడి, అలాగే మరో ప్రముఖ వైద్యురాలు డాక్టర్ మొవ్వ రమ్య శ్రీలను వారి నివాసాల్లో కలిసి డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజానికి వారు అందిస్తున్న విశిష్ట సేవలను అభినందిస్తూ, శ్రీమతి దోనేపూడి రమాదేవి వారికి సాంప్రదాయబద్ధంగా శ్రీ వేంకటేశ్వర స్వామి వారి శాలువాలు కప్పి, మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. కనిపించే దేవుళ్లు వైద్యులు: డి.ఎస్.ఆర్.కె. ప్రసాద్ ఈ సందర్భంగా ప్రసాద్స్ ఫౌండేషన్ చైర్మన్ డి.ఎస్.ఆర్.కె. ప్రసాద్ మాట్లాడుతూ... "సమాజ సేవలో



భాగస్వామ్యం కావడం మా ఫౌండేషన్ యొక్క సామాజిక బాధ్యత. వృత్తి పట్ల ఎంతో అంకితభావంతో పనిచేస్తూ, వేలాది మంది ప్రాణాలను కాపాడుతున్న ఇలాంటి గొప్ప మహిళా డాక్టర్లను సన్మానించుకోవడం మా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాం. ఈ సత్కారం వారి వృత్తి పట్ల మరింత ఉత్సాహాన్ని, సంతోషాన్ని ఇస్తుందని నమ్ముతున్నాం" అని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు: ఈ సేవా కార్యక్రమం మరియు సన్మాన మహోత్సవంలో డి.ఎస్.ఆర్.కె. ప్రసాద్, దోనేపూడి రమాదేవితో పాటు ఎమ్.ఆర్.కె.



చౌదరి, వినోద్ చౌదరి, శ్రీకాంత్, కమలాకర్ రెడ్డి, చిన్న, పెదబాబు, రవి, తులసి, రాజేష్ తదితరులు పాల్గొని వైద్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు మరియు డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు.

## పేద విద్యార్థులకు అండగా 'అట్టేపల్లి లక్ష్మీనారాయణ చారిటబుల్ ట్రస్ట్'

**స్టాలిన్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా ఉచిత షూస్,నోట్‌బుక్స్ పంపిణీ**

శేరిలింగంపల్లి,**జులై 02.అక్షర టైమ్స్ :** ప్రతినిధి ఎం.ఈరన్న మియాపూర్ పరిధిలోని స్టాలిన్ నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అట్టేపల్లి లక్ష్మీనారాయణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా షూస్, నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ అట్టేపల్లి రామప్రభు చేతుల మీదుగా విద్యార్థులకు ఈ విద్యా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ అట్టేపల్లి రామప్రభు మాట్లాడుతూ... పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు వారికి అవసరమైన విద్యా సామగ్రిని అందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. సమాజ సేవే ధ్యేయంగా తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్య, వైద్యం, అన్నదానం, పర్యావరణ పరిరక్షణ, దోమల నివారణ, ఉచిత వైద్య శిబిరాలు వంటి అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నామని




తెలిపారు. "విద్యార్థుల అభ్యున్నతే సమాజ అభివృద్ధికి పునాది" అనే సంకల్పంతో భవిష్యత్తులో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపడతామని ఆయన స్పష్టం చేశారు.

**కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు:**

ఈ సేవా కార్యక్రమంలో అట్టేపల్లి పురుషోత్తం, శ్రీరాములు, శ్రీహరి, శేర్లింగంపల్లి నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు ప్రసాద్, శోభారాణి, ఎం పీ పీ స్కూల్ ప్రిన్సిపాల్ ఎల్లయ్య, టి. నాగేశ్వర్, తిరుపతమ్మ, సుష్మిత, ఎ ఎ పి సి చైర్మన్ భాగ్యమ్మ, మోహన్, సాయిగాడ్, శ్రీను, రామ్ రెడ్డి, టి. ప్రదీప్, శ్రీశైలం, శేఖర్, హనుమంతు, తరుణ్, నవీన్, పీ. శ్రీను, రాజు, లావణ్యలతో పాటు ఏ ఆర్ పీ టీమ్ సభ్యులు, అట్టేపల్లి లక్ష్మీనారాయణ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## దొంగ సర్టిఫికెట్ ఇచ్చిన తహసిల్దార్ కూడా దోషిగా నిలవాలి

**తప్పు చేసిన ఏ ఒక్కరిని చట్టం వదలదు**

**బాధితురాలు గిరిజన మహిళకు అండగా ఉంటాము**

**వైసిపి రాష్ట్ర, జిల్లా నేతలు**

కావలి,**జులై 02.అక్షర టైమ్స్ :** కావలి పట్టణంలోని కచేరిమిట్టలో ఇటీవల దాడికి గురైన గిరిజన మహిళను పరామర్శించేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు గురువారం విచ్చేశారు. మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ కుందా రవి, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ గుండా సురేంద్ర బాధితురాలి ఇంటికి వెళ్లి ఆమెకు ధైర్యం చెప్పారు. సందర్భంగా వారు మాట్లాడుతూ బాధితురాలు గిరిజన మహిళకు జరిగిన ఘటన సంచలనం సృష్టించిన సంగతి తమను కలతపరిచిందని, ఇలాంటి వారికి వైసిపి అండగా ఉంటుందని తెలిపారు. బాధితురాలు సుకుమారి కి గిరిజన మహిళా కాదు ముస్లిం మహిళా అని, దొంగ సర్టిఫికెట్ ఇచ్చిన శ్రవణ్ కుమార్ కూడా ఈ కేసులో నిందితుడే అనీ ఎమ్మెల్సీ కుందా రవిబాబు తీవ్ర ఆరోపణలు చేశారు. కూటమి నేతలకు అనుకూలంగా అధికార దుర్వినియోగం జరుగుతోందని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ కమిషన్‌కు పూర్తి ఆధారాలతో ఫిర్యాదు చేస్తామని హెచ్చరిక చేశారు. నిజాలను బయటపెట్టి దోషులను సమాజం ముందు నిలబెడతామని స్పష్టం చేశారు. గిరిజన మహిళపై దాడి జరిగిన రోజే అసలు నిందితులను అరెస్ట్



చేయాల్సిందని విమర్శ చేశారు. నేటికి దర్జాగా నిందితుడు అయిన టిడిపి మాజీ కౌన్సిలర్ బయట తిరుగుతున్నాడు అంటే రెడ్ బుక్ రాజ్యంగా అమలు చేస్తున్నారా అని ప్రశ్నించారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఇచ్చిన రాజ్యాంగం అమలు కావాల్సిందే తప్ప మీకు నచ్చిన రాజ్యాంగం అమలు చేస్తే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. నిందితులను వదిలి బాధితులపైనే అక్రమ కేసులు నమోదు చేశారని ఆరోపణ చేశారు. కేసును నీరుగార్చేందుకు పోలీసు వ్యవస్థను ఉపయోగిస్తున్నారని తీవ్ర విమర్శలు చేశారు. అధికార పార్టీ నేతలను కాపాడేందుకే దర్యాప్తును తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపణ చేశారు. ఈ వ్యవహారంపై ఉన్నతస్థాయి, నిష్పాక్షిక విచారణ జరపాలని డిమాండ్ చేశారు. బాధ్యులందరిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ కుందా రవిబాబు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ "గిరిజన మహిళపై జరిగిన దాడి అత్యంత అమానుషమైన ఘటన. బాధితురాలు ఎస్టీ వర్గానికి చెందిన మహిళ అయితే, ఆమె సామాజిక హోదాపై కూడా ప్రశ్నలు లేవనెత్తడం బాధాకరం. గిరిజన మహిళల హక్కులను కాపాడాల్సిన వ్యవస్థే ప్రశ్నార్థకంగా మారిందని ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది" అని అన్నారు. "వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో గిరిజన మహిళకు నెల్లూరు జిల్లాలో మేయర్ పదవిని అందించిన ఘనత వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వానికే దక్కింది. అదే గిరిజన మహిళల గౌరవం నేడు ప్రమాదంలో పడిందని మేము భావిస్తున్నాం" అని పేర్కొన్నారు. అంతేకాకుండా, "ఈ ఘటనలో బాధిత కుటుంబానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది. వారికి న్యాయం జరిగే వరకు పార్టీ పోరాటం కొనసాగిస్తుంది" అని స్పష్టం చేశారు. కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి నాయకత్వంలో పాలన సాగుతున్న తీరుపై కూడా ఆయన విమర్శలు గుప్పించారు. "నియోజకవర్గంలో శాంతిభద్రతలు క్షీణించాయని, అక్రమాలు, అరాచకాలు పెరిగాయని మా అభిప్రాయం. ఈ ఘటనలపై ప్రభుత్వం వెంటనే స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి" అని డిమాండ్ చేశారు. బాధిత మహిళకు పూర్తి న్యాయం జరిగే వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తుందని పార్టీ నాయకులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వైసిపి నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కావలిలో ఘనంగా రాజ్యసభ సభ్యులు బి.యం.ఆర్ జన్మదిన వేడుకలు

**పాల్గొన్న మాజీ ఏ.యం.సి చైర్మన్ దేవరాల, తదితరులు**

**పూజలు, అన్నదానాలు, కేక్ కటింగ్ లతో సాగిన వైనం**

**విశ్వాస పాత్రులుగా నిలిచిన గోళ్ళ మురళీ**

కావలి,**జులై 02.అక్షర టైమ్స్ :** కావలి నియోజకవర్గం లోని అన్నీ మండలాల్లో రాజ్యసభ సభ్యులు, కావలి మాజీ ఎమ్మెల్యే, పేద, బడుగు, బలహీన, వర్గాల ఆశాజ్యోతి, బీద మస్తాన్ రావు యాదవ్ జన్మదినం సందర్భంగా పూజలు, అన్నదానాలు, కేక్ కటింగ్, తదితర కార్యక్రమాలతో ఘనంగా చేపట్టారు. సందర్భంగా కావలి పట్టణంలో విశ్వాస పాత్రులు, వీరాభిమాని గోళ్ళ మురళి ఆధ్వర్యంలో పట్టణంలోని రామ్మూర్తి పేటలో శ్రీ శ్రీ శ్రీ శిరిడి సాయిబాబా మందిరంలో ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిథిగా మాజీ ఏ.యం.సి చైర్మన్ దేవరాల సుబ్రమణ్యం పాల్గొన్నారు. ముందుగ సాయిబాబా మందిరంలో బి.ఎం.ఆర్ పేరుతో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించి, ఆయురారోగ్యాలు, అష్ట ఐశ్వర్యాలతో వెలుగొందాలని భగవంతుని ప్రార్థించడం జరిగింది. తదుపరి అత్యంత ప్రేమాభిమానులు, ఆత్మీయుల సమక్షంలో కరతాళ ధ్వనుల మధ్యన భారీ కేక్ కట్ చేసి వచ్చిన అభిమానులు ఆత్మీయులకు పంచిపెట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టి దాదాపుగా 1500 మందికి పైగా భోజనాలు పంపిణీ చేయడం జరిగింది. అత్యంత ప్రేమాభిమాని గోళ్ళ మురళి మాట్లాడుతూ మా ఆరాధ్య దైవం బీద మస్తాన్ రావు యాదవ్ కి మా అందరి తరపున హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు



తెలియజేశారు. బి.యం.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉచిత మెగా కంటి వైద్య శిబిరాలు, ఆరోగ్యశిబిరాలు, నిర్వహించి, నిరుపేద కుటుంబాలకు, మరియు పేద విద్యార్థు లకు ఎన్నో సహాయ, సహకారములు అందించారని తెలిపారు. ట్రస్ట్ ద్వారా 2.5 కోట్లు ఖర్చు చేసి విదేశాల నుండి ఆక్సిజన్ సిలిండర్లు అందించారని, లాక్ డౌన్ సమయంలో ఉపాధి కోల్పోయిన వారికి, మత్స్యకార కుటుంబాలకు నిత్యవసర సరుకులు అందించారని తెలిపారు. ఆక్వా రైతులకు సంబంధించి ఫ్యాక్టరీలు పెట్టి 5000 కుటుంబాలకు జీవనో పాధి కల్పించారనీ, పేదహాస్టల్ విద్యార్థులకు, ఎన్నో సదుపాయాలు కల్పించి విధ్యాభి వృద్ధికి తోడ్పడ్డారు అని, పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు గృహ నిర్మాణాలకు అవసరమైన చేయూత అందించారు అని గుర్తు చేశారు. ఆర్.ఓ ప్లాంట్ లు ఏర్పాటుచేసి పేదల దాహం తీర్చి, పేద, బడుగు, బలహీన వర్గాల



ఆపద్బాంధవులుగా నిలిచారు అన్నారు. ఇంతటి అభివృద్ధి ప్రదాత, డైనమిక్ లీడర్ డాక్టర్ బీద మస్తాన్ రావు యాదవ్ జన్మదిన వేడుకలు ఇక్కడ జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని భావోద్వేగానికి గురయ్యారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ మాజి అధ్యక్షులు దేవరాల సుబ్రహ్మణ్యం, కావలి ఏ.యం.సి చైర్మన్ పోతు గంటి అలేఖ్య, మాజీ మునిసిపల్ చైర్మన్ నగళ్ల శ్రీనివాస్ కిరణ్, లీగల్ సెల్ పొట్లూరి శ్రీనివాసులు, సీనియర్ నాయకులు బొట్లగుంట శ్రీహరి నాయుడు, కీర్మాణి, ఖలీల్, కర్రాసూర్య నారాయణ, మాజీ కౌన్సిలర్ రమణయ్య, పోటుగంటి శ్రీకాంత్, గాదంశెట్టి వేణుగోపాల్, మాజీ సర్పంచ్ నాగనగారి శ్రీనివాసులు, పాదర్తి నాగరాజు, నక్క కృష్ణ, జెనిగల్ల మనోహర్, చిన్ని, శ్రీనివాసులు, సుధాకర్, ఖాదర్ బాష తదితరులు పాల్గొన్నారు.

## భూ పోరాటానికి ఉక్కుపాదం మద్దాలి సాయికుమార్ ముందస్తు అరెస్ట్

**ప్రశ్నించిన గొంతుకే సంకెళ్లు.. మద్దాలి సాయికుమార్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు**

మౌలాలి,**జులై 02.అక్షర టైమ్స్ :** ప్రతినిధి గోపగాని పాండు తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పిలుపు మేరకు ఉప్పల్ భగాయత్‌లో నేడు నిర్వహించనున్న భూ పోరాట కార్యక్రమానికి ముందుగానే అడ్డుకట్ట వేయాలనే ఉద్దేశంతో పోలీసులు అక్రమ అరెస్టులకు పాల్పడ్డారని తెలంగాణ రక్షణ సేన నాయకులు తీవ్రంగా ఆరోపించారు. ఈ క్రమంలో టీఆర్ఎస్ నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు మద్దాలి సాయికుమార్‌ను గురువారం తెల్లవారుజామున సుమారు 4 గంటలకు నేరేడ్మెట్ పోలీసులు ఆయన నివాసానికి చేరుకుని ముందస్తుగా అదుపులోకి తీసుకుని నేరేడ్మెట్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. శాంతియుతంగా చేపట్టనున్న భూ పోరాటాన్ని అడ్డుకునేందుకు ప్రభుత్వం పోలీసు యంత్రాంగాన్ని ఉపయోగిస్తోందని నాయకులు విమర్శించారు. ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు లేకపోయినా, ఎలాంటి చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడకపోయినా ఉద్యమ నాయకులను ఇళ్ల వద్ద నుంచే అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్య విలువలకు



విరుద్ధమని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రశ్నించే గొంతులను అరెస్టులతో అణిచివేయాలనే ప్రయత్నం ప్రజాస్వామ్యానికి ప్రమాదకర సంకేతమని అన్నారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎన్నో త్యాగాలు చేసిన ఉద్యమకారుల పట్ల ప్రభుత్వం కృతజ్ఞత చూపాల్సిన సమయంలో వారిపైనే కేసులు, అరెస్టులు, ఆంక్షలు విధించడం అత్యంత బాధాకరమని తెలంగాణ రక్షణ సేన నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. భూములు, ఉద్యమకారుల హక్కులు, ప్రజల సమస్యలపై పోరాటం చేయడం రాజ్యాంగం కల్పించిన హక్కు అని, ఆ హక్కును పోలీసులు కాలరాయడం సమంజసం కాదన్నారు.ముందస్తు అరెస్టులతో ఉద్యమాన్ని ఆపగలమని ప్రభుత్వం భావిస్తే అది పొరపాటేనని, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ఎన్నటికీ చనిపోదని నాయకులు స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం, ఉద్యమకారులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం మరింత ఉధృతంగా కొనసాగుతుందని హెచ్చరించారు.మద్దాలి సాయికుమార్‌ను వెంటనే బేషరతుగా విడుదల చేయాలని, ఉద్యమకారులపై నమోదైన కేసులను ఎత్తివేయాలని, ఉప్పల్ భగాయత్ భూ సమస్యపై ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయం చేయాలని తెలంగాణ రక్షణ సేన నాయకులు డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య హక్కులను అణిచివేసే చర్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని వారు కోరారు.

# 'ఈగల్' 30 రోజులు కష్టపడి పట్టుకుంటే పోలీసుల నుంచి 5 నిమిషాల్లో తప్పించుకున్నాడు

పోలీసులు ఎన్నో విధాలుగా వెతికి నిందితులను పట్టుకుంటుంటారు. నిందితులు తమ అతి తెలివి ప్రదర్శించి జైలు నుంచి తప్పించుకునే ప్రయత్నాలు చేస్తుంటారు. ఇలాంటివి సినిమాల్లో చూస్తుంటాం. అయితే అప్పుడప్పుడు నిజ జీవితంలోనూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటుంటాయి. నార్సింగి పీఎస్ పరిధిలోని ఈ ఘటనే ఇందుకు నిదర్శనం. తెలంగాణ ఈగల్ నెల రోజుల పాటు ఎంతో శ్రమించి పట్టుకున్న నిందితుడు పారిపోయాడు. నార్సింగి పోలీసుల కళ్లుగప్పి 5 నిమిషాల్లో పరారయ్యాడు. కడుపు నొప్పి వస్తోందంటూ ఆసుపత్రికి తీసుకువెళ్లాలని నిందితుడు కట్టుకథ చెప్పాడు. ఆ తర్వాత పోలీస్‌స్టేషన్‌లోని శౌచాలయం వెంటిలేటర్ నుంచి బయటకు దూకి పారిపోయాడు. ఈ ఘటన నార్సింగి పోలీస్ స్టేషన్‌లో మంగళవారం రాత్రి వెలుగులోకి వచ్చింది. కస్టడీలో ఉన్న వ్యక్తి తప్పించుకోవడాన్ని పోలీస్ ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. హైదరాబాద్‌లోని అత్తాపూర్‌కు చెందిన సయ్యద్ ముజఫర్ అలీ (28) చిన్నతనంలోనే దారి తప్పాడు. డబ్బు కోసం అడ్డదారులు తొక్కడం ప్రారంభించి గంజాయికి అలవాటుపడ్డాడు. సొంతంగా హ్యాషిష్ ఆయిల్ విక్రయించడం చేసేవాడు. నిందితుడు జైలుకు వెళ్లి వచ్చినప్పటీ తన దందాను మాత్రం ఆపలేదు.



### శౌచాలయం నుంచి పారిపోయిన నిందితుడు

హ్యాషిష్ ఆయిల్ స్వాధీనం : ఇటీవల కాలంలో కొందరు మత్తు పదార్థాల వినియోగదారులను పోలీసులు పట్టుకున్నారు. అయితే వారికి ముజఫర్ అలీ వాటిని సరఫరా చేసినట్లు గుర్తించారు. దాదాపు 30 రోజులుగా నిందితుడి కదలికల మీద దృష్టి సారించిన తెలంగాణ ఈగల్, మంగళవారం ఆకస్మికంగా దాడి చేసి నిందితుడిని అదుపులోకి తీసుకుంది. 940 గ్రాముల హ్యాషిష్ ఆయిల్ స్వాధీనం చేసుకుంది. ముజఫర్ అలీని కొద్దిసేపు విచారించిన అధికారులు, అనంతరం నార్సింగి ఠాణాలో అప్పగించారు. బుధవారం రిమాండ్‌కు తరలించాల్సి ఉంది. శౌచాలయం నుంచి పరారైన నిందితుడు : అయితే ముజఫర్ అలీని ఉంచిన ఠాణాలో శౌచాలయంలో వెంటిలేటర్ మరమ్మతుకు గురైనట్లు నిందితుడు గుర్తించాడు. మొదట కడుపు నొప్పి వస్తుందని సిబ్బంది ముందు నటిస్తూ ఆసుపత్రికి తీసుకెళ్లాలని కోరాడు. పోలీసులు నిజమేనని భావించడంతో జైలు గది నుంచి బయటకు తీసుకుని వచ్చారు. అనంతరం మూత్ర విసర్జన కోసమంటూ నిందితుడు శౌచాలయంలోకి వెళ్లాడు. వెంటిలేటర్‌కు అద్దాలు లేకపోవడంతో అందులోంచి దూకి పారిపోయాడు. ముజఫర్ తప్పించుకోవడానికి గల కారణాలేంటని పోలీసులు ఆరా తీస్తున్నారు. ఠాణా పరిధిలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై పోలీస్ అధికారులు ఆగ్రహంగా ఉన్నారు. డ్రగ్స్ దందాలో భాగస్వామ్యమున్న నిందితుడి తల్లి రహిమున్నీసా, సోదరుడు సయ్యద్ మహ్మద్ మదర్ అలీలను బుధవారం పోలీసులు అరెస్టు చేశారు.

# తెలంగాణలో ఎన్యూమరేషన్ - జనం పరేషాన్ : పత్రాల పంపిణీ, నింపడంలో గందరగోళం


ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)లో భాగంగా బూత్ లెవల్ ఆఫీసర్లు ప్రస్తుతం ఇంటింటికీ ఎన్యూమరేషన్ పత్రాలను పంపిణీ చేస్తున్నారు. రాష్ట్రంలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లుండగా బుధవారం నాటికి 2,36,16,159 (69.82శాతం) గణన అప్లికేషన్లు అందించినట్టు అధికారులు చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. హైదరాబాద్‌లాంటి నగరాల చోట్ల అయితే ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ చాలా తక్కువగా జరిగినట్టు తెలుస్తోంది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పలు చోట్ల బీఎల్‌వోల నుంచి గంపగుత్తగా బీఎల్ఏలు, స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు ఎన్యూమరేషన్ పత్రాలను తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. రాష్ట్రంలో జూన్ 25న ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ ప్రారంభం కాగా స్వీకరణకు జులై 24 వరకు గడువుగా పెట్టారు. మొదటి వారంలో ఓటర్లందరికీ పంపిణీ చేసి, మిగతా మూడు వారాల్లో నింపిన అప్లికేషన్ ఫారాలను తీసుకోవాలని బీఎల్‌వోలకు ఎన్నికల అధికారుల నుంచి ఆదేశాలు ఉన్నాయి.ఓటు గల్లంతు అవుతుందేమోనని భయం : అయితే మొదటగా పత్రాలు ఎలా నింపాలో ఓటర్లకు వివరించడంలో పలువురు పోలింగ్ బూత్ అధికారులు పూర్తిగా అయోమయానికి గురవుతున్నారు. సందేహాల నివృత్తి కోసం వారికి ఫోన్ చేసినా ఏ మాత్రం స్పందించడం లేదని జనాలు చెబుతున్నారు. 2002 ఓటరు కార్డుకు అనుగుణంగా వివరాలు పూరించాలనే నిబంధన ఉంది. దీని కారణంగా ఓటరు కార్డులో పేరు, చిరునామా వంటివి తప్పుగా ఉన్నవారు మళ్లీ అదే విధంగా నమోదు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దాదాపు రాష్ట్రమంతటా ఇదే పరిస్థితి దాపురించింది. ఫారంలో ఏ చిన్న పొరపాటు దొర్లినా ఓటు గల్లంతు అవుతుందనే భయం పత్రాల భర్తీ ప్రక్రియను మరింత ఆలస్యం చేస్తోంది."మా కుటుంబంలో నేను, నా భార్య, కుమార్తె ముగ్గురం ఉంటాం. బీఎల్‌వోల వద్ద ఎన్యూమరేషన్ ఫారాలు తీసుకొని వివరాలు నింపాను. తప్పులు ఉన్నాయి అని నిస్సందేహంగా తిరస్కరించారు తప్ప అసలు నింపే విధానం ఏంటి అని ఎన్నిసార్లు అడిగినా చెప్పలేదు.బీఎల్‌వోలకు మరోసారి శిక్షణ : రాష్ట్రంలో ఈ సర్ ప్రక్రియలో మొత్తం 35,985 మంది బీఎల్‌వోలు ఉన్నారు. సర్వే ప్రారంభంకాక ముందే మండల స్థాయిలో వీరికి ట్రైనింగ్ ఇచ్చారు. అదేసమయంలో వీరు ఇతర విధులు కూడా నిర్వర్తించడంతో సరిగా హాజరు కాలేకపోయారు. హాజరైన వారిలోనూ పలువురికి



ఎన్యూమరేషన్ పత్రం నింపడంపై పూర్తిస్థాయిలో అవగాహన లేదు. పత్రాన్ని ఎలా నింపాలని ఓటర్లు అడిగినప్పుడు పలువురు ఏం చెప్పాలో తెలియక తికమకపడుతున్నారు. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో బీఎల్‌వోలకు మరోసారి ట్రైనింగ్ ఇవ్వాలని జిల్లా ఎన్నికల అధికారులకు (డీఈవోలు) రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ కార్యాలయం సూచించింది. అందుకు అనుగుణంగా అధికారులు ఏర్పాట్లను చూస్తున్నారు."ఒక ఇంట్లో ఉండే కోడళ్ల ఓట్లకు వారి తల్లిదండ్రుల ఓటరు గుర్తింపు కార్డులు అడుగుతున్నారు. అవి సేకరించాలంటే మాకు చాలా ఇబ్బందికరంగా ఉంది. భర్తకు సంబంధించిన ఓటరు ఐడీ నంబరు ప్రామాణికంగా తీసుకుంటేనే చాలా వెసులుబాటు ఉంటుంది'..ఇంటింటికీ తిరిగి ఎన్యూమరేషన్ అప్లికేషన్లు ఇవ్వాల్సిన బీఎల్‌వోలు ఏదో ఒక చోట కూర్చొని అందరిని అక్కడికి వచ్చి తీసుకోవాలని పిలుస్తున్నారు.జీవనోపాధి కోసం గల్ఫ్ ప్రాంతాలకు వెళ్లిన వారి వివరాలు సేకరించడం చాలా క్లిష్టంగా మారుతోంది. ఉత్తర తెలంగాణలో పలు జిల్లాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉత్పన్నమవుతోంది. పల్లెల్లో వ్యవసాయం, కూలి పనులకు వెళ్తున్న వారికోసం ఉదయం 6 నుంచి 9, లేదా రాత్రి వేళల్లో ఇంటింటికీ వెళ్లాల్సి వస్తోందని బీఎల్‌వోలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పట్టణ ప్రాంతాల్లో ఉద్యోగులు ఎక్కువగా ఉండే చోట పగలు ఇళ్లకు తాళాలు వేసి ఉంటున్నాయి. సాయంత్రం వేళ వెళితేగానీ ఓటర్లను కలుసుకోలేని పరిస్థితులు ఉన్నాయి. యాప్‌లో వివరాలు సరిపోలడానికి వయసు కీలకం అవుతోంది. 2002 నాటి వయసుకు, ప్రస్తుతానికి 22 నుంచి 23 సంవత్సరాల వ్యత్యాసం కచ్చితంగా సరిపోలితేనే యాప్ వివరాలను తీసుకుంటుంది. లేనిపక్షంలో వెంటనే తిరస్కరణకు గురవుతోంది."మాకు చదవటం, రాయటం ఏ మాత్రం రాదు. ఎన్యూమరేషన్ పత్రాన్ని ఎలా నింపాలో తెలియదు. మీకు తెలిసివాళ్లతో వివరాలు రాయించండి లేదా పదిహేను రోజులయ్యాక మేమే వస్తామని సిబ్బంది చెప్పి వెళ్లారు. దీంతో ఆ ఫారాన్ని ఇంట్లోనే భద్రంగా పెట్టాం"

# డేటా సెంటర్‌కి సింహాచలం భూములు - నోటీసులు ఇచ్చిన హైకోర్టు

: సింహాచలం దేవస్థానానికి చెందిన 160 ఎకరాల భూమిని 'హైపర్ స్కేల్ డేటా సెంటర్ పార్క్ లిమిటెడ్'కు బదిలీ చేయడంపై పర్యావరణవేత్త, 'జల్ బిరాదరి' జాతీయ కన్వీనర్ బొలిశెట్టి సత్యనారాయణ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం పై బుధవారం హైకోర్టు విచారణ చేపట్టింది. మున్సిపల్ పరిపాలన, రెవెన్యూ, పర్యావరణ దేవాదాయ శాఖల ముఖ్య కార్యదర్శులు, ఐటీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, పర్యావరణ ప్రభావ అంచనా అథారిటీ కార్యదర్శి, పీసీబీ , ఏపీఐఐసీ , దేవాదాయ శాఖ కమిషనర్, జీవీఎంసీ కమిషనర్, విశాఖపట్నం జిల్లా కలెక్టర్, హైపర్ స్కేల్ డేటా సెంటర్ పార్క్ లిమిటెడ్ సంస్థలకు కోర్టు నోటీసులు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్, న్యాయమూర్తి చల్లా గుణరంజన్లతో కూడిన ధర్మాసనం నోటీసులు జారీ చేసింది . ఈ భూ కేటాయింపులకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన కౌంటర్ అఫిడవిట్లను దాఖలు చేయాలని కోర్టు ఆదేశించింది. విశాఖపట్నం రూరల్ మండలంలోని అడవివరం, ముదసర్లోవ గ్రామాల పరిధిలో ఉన్న సింహాచలం దేవస్థానానికి చెందిన 160 ఎకరాల భూమిని, పర్యావరణ పరిరక్షణ నిబంధనలను



ఉల్లంఘించి సదరు కంపెనీకి బదిలీ చేశారని ఈ పిటిషన్‌లో ఆరోపించారు. పిటిషనర్ తరపున వాదించిన న్యా యవాది చల్లా అజయ్ కుమార్, ఈ భూ బదిలీ దేవాదాయ చట్టంలోని సెక్షన్ 80(1)(ఎ)కి విరుద్ధమని పేర్కొన్నారు. డేటా సెంటర్ కోసం ప్రతిపాదించిన స్థలం కంబాలకొండ వన్యప్రాణుల అభయారణ్యం నుంచి కేవలం 860 మీటర్ల దూరంలోనే ఉందని ఆయన తెలిపారు. ఆ భూములను తిరిగి సింహాచలం దేవ స్థానానికి అప్పగించేలా ఆదేశాలు ఇవ్వాలని వారు కోరారు. అభ్యంతరాలు ఉంటే ఎన్‌జీటీ (చీ+ు)ని ఆశ్రయించండి : రాష్ట్ర ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. భూ బదిలీ విషయంలో పిటిషనర్‌కు అపోహ ఉందని పేర్కొన్న ఆయన, ఆ భూమిని లీజు ప్రాతి పదికన డేటా సెంటర్ పార్క్ కోసం కేటాయిస్తున్నట్లు స్పష్టం చేశారు. పర్యావరణ అనుమతులు భూ కేటాయింపులను ఒకే పిటిషన్‌లో సవాలు చేయ లేమని ఆయన వాదించారు. పర్యావరణ చట్టాలను ఉల్లంఘించి అనుమతులు మంజూరు చేశారనే ఆందోళనలు ఉంటే, ఆ విషయాన్ని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ముందు సవాలు చేయాలని ఆయన తెలిపారు. పూర్తి వివరాలతో కూడిన కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయడానికి ఆయన సమయం కోరారు.

# తెలంగాణలోని నిరుద్యోగులకు తీపి కబురు.. ఇంటర్వ్యూలు లేకుండానే 984 వర్సిటీ ఉద్యోగాల భర్తీ

తెలంగాణలోని నిరుద్యోగ యువతకు, విద్యావంతులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. రాష్ట్రంలోని మూడు ప్రతిష్టాత్మక వ్యవసాయ అనుబంధ విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 984 అధ్యాపక, ఇతర పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపింది. ఈ నియామక ప్రక్రియలో అత్యంత కీలకమైన మార్పునకు శ్రీకారం చుడుతూ, ఇప్పటివరకు ఉన్న ఇంటర్వ్యూ విధానాన్ని పూర్తిగా రద్దు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇకపై కేవలం రాతపరీక్షలో సాధించిన మార్కులు, అకడమిక్ మెరిట్ ఆధారంగానే అభ్యర్థులను ఎంపిక చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఆచార్య జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం (పీజేటీఎస్ఏయూ), కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం (ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ), పీవీ నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం (పీవీఎన్ఆర్‌టీవీయూ)లలో ఈ నియామకాలు చేపట్టనున్నారు. వ్యవసాయ శాఖపై జరిగిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. నియామక ప్రక్రియలో పారదర్శకతను పెంచడం, ఎలాంటి అవినీతి, సిఫార్సులకు తావులేకుండా చూడటమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే గ్రూప్-1 వంటి ఉన్నతస్థాయి ఉద్యోగ నియామకాల్లో ఇంటర్వ్యూలను రద్దు చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ, అదే విధానాన్ని విశ్వవిద్యాలయాల నియామకాల్లోనూ అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రభుత్వ నిర్ణయంతో మూడు వర్సిటీల్లో నియామకాల ప్రక్రియ వేగవంతం కానుంది. ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం తమ పరిధిలో 550 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు, ఇంటర్వ్యూలు లేకుండా కేవలం రాతపరీక్ష మార్కుల ఆధారంగానే ఈ పోస్టులను భర్తీ చేసేందుకు త్వరలోనే కొత్త నోటిఫికేషన్ జారీ చేస్తామని వర్సిటీ వైస్ ఛాన్సలర్ జానయ్య తెలిపారు.మరోవైపు కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఇప్పటికే 140 పోస్టుల (79 అసిస్టెంట్ ప్రొఫెసర్, 44 అసోసియేట్ ప్రొఫెసర్, 17 ప్రొఫెసర్) భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయగా, ఆ ప్రక్రియలో కూడా ఇంటర్వ్యూలను మినహాయించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక, పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలో బ్యాక్‌లాగ్, కొత్త ఖాళీలతో కలిపి మొత్తం 294 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ పోస్టులకు కూడా కొత్త నిబంధనే వర్తిస్తుంది.ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై నిరుద్యోగ అభ్యర్థుల నుంచి సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఇంటర్వ్యూల పేరుతో జరిగే అవకతవకలకు, సిఫార్సులకు చెక్ పడుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కేవలం ప్రతిభ ఆధారంగానే ఉద్యోగాలు లభించే అవకాశం కలగడం వల్ల గ్రామీణ, పేద నేపథ్యం ఉన్న అర్హులైన అభ్యర్థులకు న్యాయం జరుగుతుందని విద్యావేత్తలు సైతం అభిప్రాయపడుతున్నారు. సంబంధిత విశ్వవిద్యాలయాల బోర్డులు త్వరలోనే ఈ పోస్టులకు సంబంధించిన పూర్తి సిలబస్, పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాయి.

# ఆదాయానికి మించిన ఆస్తులు! డీఎస్పీ భీమ్‌రెడ్డి ఇంట్లో ఏసీబీ సోదాలు



ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో డీఎస్పీ భీమ్‌రెడ్డి ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 20 ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు తనిఖీలు కొనసాగిస్తున్నారు. హైదరాబాద్ నార్సింగిలోని వేసెల్లా మెడోస్‌లోని భీమ్‌రెడ్డి ఇల్లు సహా 20 చోట్ల ఏకకాలంలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో భీమ్‌రెడ్డి పని చేశారు. ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టారని భీమ్‌రెడ్డిపై ఆరోపణలు రావడంతో ఏసీబీ సోదాలు చేస్తోంది. ప్రస్తుతం డీజీపీ ఆఫీస్‌లోని కంప్యూటర్ సర్వీసెస్‌లో భీమ్‌రెడ్డి డీఎస్పీగా పని చేస్తున్నారు.

# ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు

**సీఎం రేవంత్‌రెడ్డి హామీ అమలు**

**ఆర్థిక శాఖ ఉద్యోగుల ఖాతాల్లో నగదు జమ**

**ఇకపై 25లోగా జీతాల బిల్లులు సమర్పించాలని ఆదేశాలు**

**ప్రభుత్వ నిర్ణయంపై ఉద్యోగుల్లో ఆనందం**



రాష్ట్రంలోని ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఈ నెల ఒకటో తేదీనే వారి జీతాలను ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. వివిధ ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లు, సొసైటీలు, విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ అనుబంధ సంస్థల్లో పనిచేస్తున్న సిబ్బందికి వేతనాలు జమయ్యాయి.గతంలో జీతాల చెల్లింపులో ఆలస్యం కావడంతో ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. రెగ్యులర్ ఉద్యోగులతో పాటు ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్, ఏజెన్సీ సిబ్బందికి కూడా ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు అందేలా సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు ఆర్థిక శాఖ జీతాల చెల్లింపును పూర్తి చేసింది. - ఇకపై ప్రతి నెల 25వ తేదీలోగా జీతాల బిల్లులను ట్రెజరీ, పే అండ్ అకౌంట్స్ విభాగాలకు పంపాలని, నెలలో చవరి పని దినానికల్లా ఆడిట్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆర్థిక శాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రభుత్వ నిర్ణయంపై ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# అమర్‌నాథ్ యాత్ర.. తొలి బృందానికి చందర్‌కోట్‌లో ఘన స్వాగతం

**బల్తాల్ మార్గ యాత్రికులను ఆహ్వానించిన అధికారులు, పౌర సమాజం**

**భద్రత, వసతులపై విస్తృత ఏర్పాట్లు చేసిన జమ్మూకశ్మీర్ యంత్రాంగం**

**రేపటి నుంచి ప్రారంభమై 57 రోజుల పాటు కొనసాగనున్న పవిత్ర యాత్ర**

**ఇప్పటికే 3.5 లక్షల మందికి పైగా భక్తుల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్**



అమర్‌నాథ్ యాత్రకు సర్వం సిద్ధమైంది. ఈ యాత్రలో భాగంగా బల్తాల్ మార్గంలో బయల్దేరిన తొలి బృందం యాత్రికులకు నేడు ఘన స్వాగతం లభించింది. జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారిపై ఉన్న రాంబన్ జిల్లాలోని చందర్‌కోట్ వద్ద ఏర్పాటు చేసిన లంగర్ (ఉచిత భోజనశాల) వద్ద అధికారులు, స్థానికులు యాత్రికులను సాదరంగా ఆహ్వానించారు. రాంబన్ జిల్లా యంత్రాంగం, పౌర సమాజ ప్రతినిధులు, పలు లంగర్ సంస్థలు కలిసి యాత్రికులకు శుభాకాంక్షలు తెలిపి, వారి యాత్ర ప్రశాంతంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీఐజీ (డీకేఆర్ రేంజ్) సర్గున్ శుక్లా, రాంబన్ డిప్యూటీ కమిషనర్ మహ్మద్ అలియాస్ ఖాన్, ఎస్ఎస్పీ అరుణ్ గుప్తా, ఎస్ఎస్పీ ట్రాఫిక్ రాజా ఆదిల్ హమీద్‌తో పాటు పలువురు సీనియర్ సివిల్, పోలీసు అధికారులు పాల్గొన్నారు. జమ్మూలోని భగవతి నగర్ బేస్ క్యాంప్ నుంచి లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా గురువారం ఉదయం యాత్రికుల కాన్వాయ్‌ను జెండా ఊపి ప్రారంభించిన తర్వాత, చందర్‌కోట్ వారికి మొదటి ప్రధాన విరామ కేంద్రంగా నిలిచింది. యాత్రికులకు ఆహారం, తాగునీరు, ఇతర అత్యవసర సేవలు అందించేందుకు ఇక్కడ అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. యాత్రికుల భద్రత, సంక్షేమం, ప్రయాణం సాఫీగా సాగేందుకు జిల్లా యంత్రాంగం విస్తృతమైన ఏర్పాట్లు చేసింది. పోలీసు, ఆర్మీ, సీఏపీఎఫ్, ట్రాఫిక్ పోలీసు, ఆరోగ్య శాఖ, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక సేవలు వంటి ఇతర ఏజెన్సీలతో సమన్వయం చేసుకుంటూ పటిష్ఠమైన చర్యలు తీసుకుంది. రాంబన్ జిల్లాకు ఉన్న ఆతిథ్య సంప్రదాయానికి ఈ స్వాగత కార్యక్రమం అద్దం పడుతోంది. దేశవ్యాప్తంగా తరలివచ్చే భక్తులకు ఈ వార్షిక యాత్రను ఒక మధురమైన అనుభూతిగా మార్చడంలో భాగస్వాములందరి సమష్టి నిబద్ధతను ఇది తెలియజేస్తోంది.

### యాత్ర నేపథ్యం.. వివరాలు

భారతదేశంలోని అత్యంత పవిత్రమైన పుణ్యక్షేత్ర యాత్రలలో శ్రీ అమర్‌నాథ్ యాత్ర ఒకటి. ప్రతి సంవత్సరం లక్షలాది మంది భక్తులు దక్షిణ కశ్మీర్‌లోని హిమాలయాల్లో సుమారు 3,880 మీటర్ల ఎత్తులో ఉన్న అమర్‌నాథ్ గుహను సందర్శిస్తారు. ఇక్కడ సహజంగా ఏర్పడిన మంచు శివలింగాన్ని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. ఈ మంచు లింగం శివుని ప్రతీకగా భక్తులు భావిస్తారు.ఈ ఏడాది 57 రోజుల పాటు కొనసాగే ఈ యాత్ర జులై 3న అధికారికంగా ప్రారంభమై, రక్షా బంధన్ పర్వదినం రోజున అంటే ఆగస్టు 28న ముగుస్తుంది. అనంతనాగ్ జిల్లాలోని సంప్రదాయ 48 కిలోమీటర్ల నున్వాన్-పహల్గామ్ మార్గం, అలాగే గందర్‌బల్ జిల్లాలోని తక్కువ దూరంతో నిటారుగా ఉండే 14 కిలోమీటర్ల బల్తాల్ మార్గం ద్వారా ఏకకాలంలో యాత్ర కొనసాగుతుంది. యాత్రను విజయవంతంగా నిర్వహించేందుకు జమ్మూకశ్మీర్ వ్యాప్తంగా ఆన్‌స్పాట్ రిజిస్ట్రేషన్, ఆర్ఎఫ్ఐడీ కార్డుల జారీ, పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు, మౌలిక సదుపాయాల మెరుగుదల వంటి పనులను పూర్తి చేశారు. నివేదికల ప్రకారం, ఈ యాత్ర కోసం ఇప్పటివరకు 3.5 లక్షల మందికి పైగా భక్తులు నమోదు చేసుకున్నారు. రద్దీని నియంత్రించేందుకు రోజువారీ యాత్రికుల సంఖ్యపై పరిమితులు విధించారు.

# బంగారం, వెండి కొనడం ఆపేయండి

### ధరలు మరింత పతనం కాక తప్పదంటున్న నిపుణులు



కారణం ఏంటంటే.. ఇటీవలి కాలంలో అంతర్జాతీయ, దేశీయ మార్కెట్లలో బంగారం, వెండి ధరలు తీవ్రమైన హెచ్చుతగ్గులకు లోనవుతూ గందరగోళ పరిస్థితులను సృష్టిస్తున్నాయి. లాభాల స్వీకరణ (ప్రాఫిట్ బుకింగ్) కారణంగా ధరలు ఒకరోజు పెరగడం, మరోకరోజు పడిపోవడం వంటి పరిణామాలతో సాధారణ పెట్టుబడిదారులు మార్కెట్లో ఎప్పుడు అడుగుపెట్టాలో తేల్చుకోలేకపోతున్నారు. ప్రస్తుత స్వల్పకాలిక పరిస్థితుల్లో బంగారం ధరలపై కొంత ఒత్తిడి కొనసాగే అవకాశం ఉన్నప్పటికీ.. సుదీర్ఘ కాలపరిమితితో పెట్టుబడి పెట్టాలనుకునే వారికి మాత్రం ప్రస్తుత ధరల స్థాయిలు చాలా అనుకూలమైనవిగా మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. కమోడిటీ మార్కెట్ నిపుణుల అంచనాల ప్రకారం.. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధర ప్రస్తుతం 4,000 డాలర్ల కంటే తక్కువ స్థాయిలోనే ట్రేడ్ అవుతోంది. అలాగే దేశీయ మార్కెట్‌లోనూ దీని ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. రాబోయే ఆగస్టు ఫ్యూచర్స్ ధరలు దాదాపు 1 శాతం తగ్గి, 10 గ్రాముల ధర సుమారు రూ. 1.41 లక్షల వద్ద కొనసాగుతోంది. ఈ బలహీనతకు ప్రధాన కారణం అమెరికా సెంట్రల్ బ్యాంక్ అయిన 'ఫెడరల్ రిజర్వ్' తీసుకోబోయే వడ్డీ రేట్ల విధానమే. ఈ ఏడాది అమెరికాలో వడ్డీ రేట్లు మరింత పెరగవచ్చనే అంచనాలతో పెట్టుబడిదారులు అప్రమత్తమయ్యారు. దీనికి తోడు అంతర్జాతీయంగా యూఎస్ డాలర్ ఇండెక్స్ బలోపేతం కావడం, ట్రెజరీ ఈల్డ్స్ (బాండ్ల రాబడి) గరిష్ట స్థాయిల్లో ఉండటంతో మార్కెట్ సెంటిమెంట్ దెబ్బతింది. సాధారణంగా డాలర్, వడ్డీ రేట్లు పెరిగినప్పుడు, పెట్టుబడిదారులు నుండి ఇతర లాభదాయకమైన మార్గాల వైపు మళ్లుతారు. ఈ కారణంగానే గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ నుండి పెద్ద ఎత్తున నిధుల ఉపసంహరణ జరుగుతోంది. ఫెడరల్ రిజర్వ్ కొత్త ఛైర్మన్ అనుసరించే కఠిన విధానాల వల్ల ధరలు రాబోయే రోజుల్లో మరికొంత బలహీనపడే అవకాశం ఉన్నప్పటికీ, ఈ పతనం మరీ ఘోరంగా ఉండకపోవచ్చని నిపుణులు భావిస్తున్నారు. అంతర్జాతీయంగా బంగారానికి 3,700 నుండి 3,800 డాలర్ల వద్ద బలమైన మద్దతు (సపోర్ట్) లభించవచ్చు. బంగారం నన్ను ఇంతలా మోసం చేస్తుందనుకోలేదు.. ఫెయిల్ అయ్యానంటున్న రాబర్ట్ కియోసాకి.. అదేవిధంగా దేశీయ మార్కెట్‌లో రాబోయే ఒకటి రెండు వారాల్లో 10 గ్రాముల బంగారం ధరపై మరో రూ. 3,000 వరకు తగ్గి, రూ. 1.38 లక్షల స్థాయికి చేరే అవకాశం ఉంది. అందువల్ల ఒకేసారి పెద్ద మొత్తంలో కాకుండా, చిన్న మొత్తాలలో క్రమ పద్ధతిలో విధానంలో) ప్రస్తుత ధరల వద్ద కొనుగోలు ప్రారంభించడం దీర్ఘకాలిక పెట్టుబడిదారులకు మంచి లాభాలను తెచ్చిపెడుతుంది. ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను స్థిరంగా ఉంచితే, మార్కెట్ అంచనాలు మారి బంగారానికి మళ్లీ మంచి డిమాండ్ ఏర్పడుతుందని విశ్లేషకులు నమ్ముతున్నారు. మరోవైపు భారతదేశంలో బంగారం దిగుమతుల గణాంకాలు ప్రస్తుతం మందకొడిగా సాగుతున్నాయి. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో దిగుమతులు చాలా బలంగా ఉన్నప్పటికీ, ఏప్రిల్, మే, జూన్ నెలల్లో మాత్రం అవి సాధారణం కంటే తక్కువగా నమోదయ్యాయి. ప్రభుత్వ కఠిన విధానాలు, మార్కెట్లో నెలకొన్న అధిక ధరలు, కాలానుగుణంగా వచ్చే మార్పుల వల్లే డిమాండ్ తగ్గింది. ఈ మందగమనం రాబోయే రెండు నెలల పాటు కొనసాగే అవకాశం ఉన్నప్పటికీ, ధరలు కాస్త స్థిరపడితే రాబోయే పండుగ సీజన్ నాటికి కొనుగోళ్లు మళ్లీ పుంజుకుంటాయని పరిశ్రమ వర్గాలు ఆశిస్తున్నాయి. ఇదే సమయంలో భారతీయ ఆభరణాల మార్కెట్‌లో ఒక ఆసక్తికరమైన కొత్త ధోరణి కనిపిస్తోంది. బంగారం ధరలు సామాన్యుడికి అందుబాటులో లేనంతగా పెరిగిపోతుండటంతో, చాలా మంది వినియోగదారులు సాంప్రదాయక 22-క్యారెట్ల ఆభరణాల నుండి తక్కువ ధరలో లభించే 18-క్యారెట్లు, 14-క్యారెట్లు, 9-క్యారెట్ల ఆభరణాల వైపు మొగ్గు చూపుతున్నారు. అయితే ఈ మార్పు కేవలం సాధారణ, ఫ్యాషన్ ఆభరణాలకే పరిమితమైంది. భారతదేశంలో పెళ్లిళ్ల సీజన్ కొనుగోళ్లలో మాత్రం ఇప్పటికీ 22-క్యారెట్ల బంగారు ఆభరణాలకే అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు, మరియు రాబోయే రోజుల్లో కూడా ఈ సాంప్రదాయక ధోరణి మారే అవకాశం లేదని మార్కెట్ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# యుద్ధంపై ఇరాన్ కీలక ప్రకటన

## అది సాధ్యం కాకుంటే అమెరికా అంతు తేలుస్తామని హెచ్చరిక



అమెరికాతో సాగుతున్న దౌత్య ప్రయత్నాలు ఒకవేళ విఫలమైతే తాము యుద్ధానికి పూర్తిగా సిద్ధంగా ఉన్నామని ఇరాన్ మంగళవారం నాడు తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. అయితే తమ ప్రాధాన్యత ఎప్పుడూ చర్చలకే ముందుగా ఉంటుందని ఇరాన్ మరోసారి స్పష్టం చేసింది. వాషింగ్టన్ -టెహ్రాన్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం అమలును ముందుకు తీసుకెళ్లేందుకు ఇరు దేశాల ప్రతినిధులు ఖతార్‌లో వేర్వేరుగా భేటీ కావడానికి సిద్ధమవుతున్న తరుణంలో ఇరాన్ నుండి ఈ కీలక ప్రకటన వెలువడింది. ప్రభుత్వ టెలివిజన్‌కు ఇచ్చిన ఒక ప్రత్యేక ఇంటర్వ్యూలో ఇరాన్ పార్లమెంట్ స్పీకర్, ఆ దేశ ప్రధాన సంధానకర్త అయిన మొహమ్మద్ బఘేర్ ఘాలిబాఫ్ ఈ విషయాలను వెల్లడించారు. అమెరికాతో తాము చర్చలను కొనసాగిస్తామని స్పష్టం చేస్తూనే.. ఒకవేళ అవతలి పక్షం తమ కట్టుబాట్లను గౌరవించకపోతే సైనిక ఘర్షణకు వెనకాడబోమని ఆయన హెచ్చరించారు. మేము చర్చలనే కోరుకుంటున్నాము, కానీ ఒకవేళ ఆ చర్చలు ఫలించకపోతే.. మేము యుద్ధానికి సిద్ధంగా ఉన్నాము. దానికి తగినట్లుగానే స్పందిస్తామని ఘాలిబాఫ్ నొక్కి చెప్పారు. ఈ సందర్భంగా అణు కార్యక్రమంపై దేశ వైఖరిని ఆయన స్పష్టం చేశారు. దేశ అణు హక్కులు, తాము గీసుకున్న రెడ్ లైన్స్ (లక్ష్మణ రేఖలు) విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. ఇరాన్ అణు కార్యకలాపాలన్నీ అంతర్జాతీయ అణుశక్తి సంస్థ పర్యవేక్షణలోనే.. అణ్వాయుధాల వ్యాప్తి నిరోధక ఒప్పందం (ఫీూ) పరిధిలోనే జరుగుతున్నాయని వివరించారు. అణ్వస్త్ర సుసంపన్నతను ఇరాన్ తన హక్కుగా భావిస్తోందని, అమెరికా దురాగతాలకు వ్యతిరేకంగా, దేశ రక్షణకు ఇవి ఒక గ్యారెంటీ లాంటివని ఆయన అభివర్ణించారు. 2015 నాటి సంయుక్త సమగ్ర కార్యాచరణ ప్రణాళిక ఒప్పందంలో ఎదురైన చేదు అనుభవాలను గుర్తుచేస్తూ.. అంతర్జాతీయ హామీల విశ్వసనీయతపై ఆయన అనుమానాలు వ్యక్తం చేశారు.అమెరికాతో దోహాలో ఎలాంటి చర్చల్లేవ్.. బాంబు పేల్చిన ఇరాన్.. ట్రంప్‌ను ఏకి పారేస్తున్న అమెరికన్లు.. ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయని పేర్కొన్న ఘాలిబాఫ్.. లెబనాన్ సమస్య, చమురు ఎగుమతులు, హార్ముజ్ జలసంధి గుండా నౌకాయానం వంటి ఐదు కీలక నిబంధనలపై పూర్తిగా స్పష్టత వచ్చి, అవి ఖరారు అయ్యేంత వరకు ఇరాన్ ఒప్పందం అమలు తదుపరి దశకు వెళ్లదని స్పష్టం చేశారు. ఒప్పందంలోని మొదటి ఆర్టికల్ ప్రకారం లెబనాన్‌లో యుద్ధం ముగియాలని, ఎలాంటి సైనిక చర్యలు చేపట్టకూడదని, ప్రజలు తమ సొంత ప్రాంతాలకు తిరిగి రావాలని, లెబనాన్ సార్వభౌమాధికారం కాపాడబడాలని అమెరికా హామీ ఇస్తోందని, దీనిని సాధించడమే తమ లక్ష్యమని చెప్పారు. హార్ముజ్ జలసంధి గుండా సురక్షిత ప్రయాణానికి తాము కట్టుబడి ఉన్నామని, అమెరికా కూడా అలాగే చేయాలని డిమాండ్ చేశారు. ఇదే సమయంలో అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియోపై ఘాలిబాఫ్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఇజ్రాయెల్‌తో లెబనాన్ సంబంధాలను సాధారణీకరించడానికి రూబియో ప్రయత్నిస్తున్నారని, అటువంటి చర్యలు ప్రస్తుత అవగాహన ఒప్పందానికి పూర్తిగా విరుద్ధమని అన్నారు. రూబియో వాషింగ్టన్ మెమోరాండం ద్వారా అబ్రహం ప్రణాళికను ముందుకు తీసుకెళ్లాలని చూస్తుంటే.. తాము మాత్రం లెబనాన్ స్వాతంత్ర్యాన్ని పరిరక్షించడానికి ప్రయత్నిస్తున్నామని ఆరోపించారు. అలాగే ఇరాన్ చమురు ఎగుమతుల గురించి మాట్లాడుతూ.. ఆంక్షలు ఎత్తివేసిన తర్వాత తాము 40 మిలియన్ బ్యారెళ్లకు పైగా చమురును రవాణా చేశామని.. అయితే గత 50 నుండి 60 రోజులుగా ఒక్క బ్యారెల్ చమురు కూడా ఎగుమతి చేయలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు ఇరు దేశాల మధ్య మధ్యవర్తిగా ఖతార్ తన పాత్రను పునరుద్ఘాటించింది. అమెరికా-ఇరాన్ చర్చలలోని తాజా పరిణామాలను ఖతార్ విదేశాంగ మంత్రి మహమ్మద్ బిన్ అబ్దుల్ రహమాన్ అల్ థానీ.. అమెరికా రాయబారులైన స్టీవ్ విట్కాఫ్, జారెడ్ కుష్నర్‌లతో చర్చించినట్లు ఖతార్ విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. వాషింగ్టన్, టెహ్రాన్‌ల మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం సఫలం కావడానికి అవసరమైన అన్ని రకాల చర్చలకు మద్దతు ఇవ్వడానికి ఖతార్ కట్టుబడి ఉందని స్పష్టం చేసినప్పటికీ.. ఈ చర్చలకు సంబంధించిన పూర్తి వివరాలను మాత్రం ప్రస్తుతానికి వెల్లడించలేదు.

### ఉద్యోగులకు షాక్.. 5,500 మందిని తొలగించనున్న మైక్రోసాఫ్ట్..!




లే ఆఫ్స్ భయంతో సాఫ్ట్ వేర్ ఉద్యోగులు వణికిపోతున్నారు. ఏ క్షణం ఉద్యోగం ఊడిపోతుందోనని ఆందోళనగా ఉన్నారు. ప్రపంచ దిగ్గజ సంస్థలు కూడా ఉద్యోగులను తొలగిస్తున్నాయి. గతే ఏడాది నుంచి పెద్ద పెద్ద కంపెనీల్లో లే ఆఫ్స్ కొనసాగుతోన్నాయి. తాజాగా దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్ వచ్చే వారం మరో విడత ఉద్యోగులను తొలగించే అవకాశం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే చాలా వరకు ఏఐని వాడడం వల్ల ఉద్యోగాలు పోతున్నాయని అంటున్నారు. అయితే పెద్ద కంపెనీలు భారీ ఎత్తున ఏఐ కోసం ఖర్చు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఖర్చు తగ్గించుకోవడానికి ఉద్యోగులను తొలగిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇప్పుడు మైక్రోసాఫ్ట్ కూడా ఏఐ కోసం భారీ పెట్టుబడులు పెట్టడానికి సిద్ధమైందని తెలుస్తోంది. పెట్టుబడులు పెడుతూనే ఖర్చులు తగ్గించుకోవడానికి ఉద్యోగులను తొలగించాలని నిర్ణయం తీసుకున్నట్లు నివేదికలు బయటకు వస్తున్నాయి. ప్రస్తుతం వస్తున్న వార్తల ప్రకారం మైక్రోసాఫ్ట్ తన వర్క్ ఫోర్స్ సుమారు 2.5 శాతం మందిని తొలగించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. వచ్చే వారం ప్రారంభంలో ఉద్యోగుల తొలగింపు ఉండే అవకాశం ఉంది. ప్రస్తుతం మైక్రోసాఫ్ట్ లో దాదాపు 2,20,000 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. ఈ నిర్ణయం వల్ల దాదాపు 5,500 మంది ఉద్యోగులు.. తమ ఉద్యోగాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది. అయితే మైక్రోసాఫ్ట్ ఉద్యోగులను తొలగించడం ఇది మొదటిసారి కాదు. గతంలో కూడా ఉద్యోగుల్ని తొలగించింది. గత ఏడాది మే, జూలై నెలల మధ్య దాదాపు 15,000 ఉద్యోగుల్ని తొలగించింది. ఇది అప్పుడున్న వర్క్ ఫోర్స్ లో 4 శాతానికి సమానం. కాగా ఈ ఏడాది మొదట్లో దాదాపు 8,750 మంది అర్హులైన ఉద్యోగులను స్వచ్ఛంద నిష్క్రమించే అవకాశం కల్పించింది. ఉద్యోగాల తొలగింపుపై మైక్రోసాఫ్ట్ ను సంప్రదించగా.. స్పందించడానికి నిరాకరించినట్లు తెలుస్తోంది. ఈ విడతలో సేల్స్, కన్సల్టింగ్, ఎక్స్‌బాక్స్ గేమింగ్ విభాగంతో సహా పలు విభాగాలలోని ఉద్యోగులను తొలగించే అవకాశం ఉంది. లే ఆఫ్ ఫై ప్రకారం 2026లో ఇప్పటివరకు టెక్ కంపెనీలు మొత్తం 1,22,524 మంది ఉద్యోగులను తొలగించాయి. మూడు రోజుల క్రితం ఓ ఉద్యోగి తన ఉద్యోగం కోల్పోవడంపై సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. తమ ఇంజనీరింగ్ టీమ్ లో రాత్రికి రాత్రే 150 మంది ఉద్యోగులను తొలగించినట్లు పేర్కొన్నారు. 1.8 సంవత్సరాలు పని చేసి తర్వాత తనకు రాత్రికి రాత్రే ఉద్యోగం కోల్పోయానని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అమెరికాకు చెందిన ఓ కంపెనీ ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా రాత్రికి రాత్రే టీమ్ మొత్తాన్ని తొలగించిందని పేర్కొన్నారు. తొలగించిన ఉద్యోగులకు ఎలాంటి ప్యాకేజీ ప్రకటించలేదని పోస్ట్ లో తెలిపారు. తమ ఇంజనీరింగ్ బృందంలో దాదాపు 150 మంది పని చేస్తారని చెప్పారు. వీరందరికి రాత్రి 9 గంటలకు మైక్రోసాఫ్ట్ టీమ్స్ కాల్ ఇన్విటేషన్ పంపారని చెప్పారు. మీటింగ్ జాయిన్ అయిన తర్వాత పునర్వ్యవస్థీకరణలో భాగంగా టీమ్ తొలగిస్తున్నట్లు ప్రకటించారని వివరించారు.

### ఒక్క రోజే 18 శాతం పెరిగిన స్టాక్ కారణం అదేనా..!




బుధవారం ఓ స్టాక్ భారీగా పెరిగింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నూతన సాంకేతిక రంగంలోకి తమ అనుబంధ సంస్థల ద్వారా ప్రవేశించడానికి చర్యలు తీసుకున్నట్లు కంపెనీ ప్రకటించిన నేపథ్యంలో బుధవారం బీఎస్ఈలో రిలయన్స్ పవర్ షేరు ధర 18 శాతానికి పైగా పెరిగి ఇంట్రాడేలో గరిష్టంగా రూ.24.84కు చేరుకుంది. ఈ ర్యాలీతో, వరుసగా నాలుగు సెషన్లలో నష్టాలతో ఉన్న షేరుకు తెరపడింది. తొలుత 5 శాతం, తర్వాత 10 శాతం అప్పర్ సర్క్యూట్లు కొట్టి ఇంట్రాడేలో అంతకుమించి కూడా దూసుకెళ్లింది. తమ వ్యాపార సాంకేతికత ఆధారిత కార్యకలాపాలను మొదలు పెడతామని కంపెనీ ఎక్స్ఛేంజ్ ఫైల్ లో తెలిపింది. దీంతో కంపెనీ షేర్లు భారీగా పెరిగాయి. రిలయన్స్ పవర్ తన అనుబంధ సంస్థల ద్వారా ఏఐ అధారిత డేటా సెంటర్లకు అవసరమైన స్వచ్ఛ ఇంధనాన్ని సరఫరా చేసేందుకు ప్లాన్ చేస్తున్నామని కంపెనీ ప్రకటించింది. ఇప్పటికే సబ్సిడరీల్లో 4 కంపెనీల షేర్లను కూడా మార్చింది. రిలయన్స్ ఏఐ గ్రీన్ పవర్ ప్రైవేట్ లిమిటెడ్, రిలయన్స్ ఏఐ పవర్ ప్రైవేట్ లిమిటెడ్, రిలయన్స్ ఏఐ డేటా కంట్రోల్ ప్రైవేట్ లిమిటెడ్, రిలయన్స్ ఏఐ డేటా సి ప్రైవేట్ లిమిటెడ్ గా పేరు మార్చింది. రిలయన్స్ పవర్ మార్చి 31తో ముగిసిన త్రైమాసికానికి రూ.494 కోట్ల ఏకీకృత నికర నష్టాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో రూ.125.57 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. కంపెనీ మొత్తం ఆదాయం ఈ త్రైమాసికంలో రూ.1,946.33 కోట్లకు తగ్గింది. గత ఏడాది ఇదే కాలంలో ఇది 2,065.64 కోట్లుగా ఉంది. రిలయన్స్ గ్రూప్ లో ముఖ్యమైన రిలయన్స్ పవర్ విదేశాలలో విద్యుత్ ఉత్పాదన ప్రాజెక్టులు అభివృద్ధి చేస్తోంది. రిలయన్స్ పవర్ దాదాపు 6,000 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఈ స్టాక్ దీూజులో జూలై 2025లో రూ.71 వద్ద తన 52 వారాల గరిష్ట స్థాయిని తాకింది. మార్చి 2026లో రూ.20.23 వద్ద కనిష్ట స్థాయిని నమోదు చేసింది. అయితే ఈ స్టాక్ లో స్థిరత లేదు ఒకసారి పెరిగితే మరోసారి తగ్గుతుంది. అయితే స్టాక్ లో పెట్టుబడి పెట్టే ముందు ఆ స్టాక్ ఫండమెంటల్ గురించి పూర్తిగా తెలుసుకోవాలి. రిలయన్స్ పవర్ స్టాక్ పై ఇప్పుడే ఒక అంచనాకు రావొద్దు. పైగా కంపెనీ అప్పులు ఎక్కువగా ఉన్నాయని నిపుణలు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కంపెనీ ఫలితాలను బట్టి నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

# దుబాయ్ వెళ్లే భారతీయులకు అలర్ట్


### యూఏఈ వీసా నిబంధనల్లో కీలక మార్పులు..కొత్త ఎంట్రీ రూల్స్ ఇవే



యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ తన వీసా-ఆన్-అరైవల్ నిబంధనలలో పలు ముఖ్యమైన మార్పులు చేసింది. ఫెడరల్ అథారిటీ ఫర్ ఐడెంటిటీ, సిటిజన్‌షిప్, కస్టమ్స్ పోర్ట్ సెక్యూరిటీ జారీ చేసిన తాజా మార్గదర్శకాల ప్రకారం.. ఇకపై కేవలం యూకే నివాస వీసా మాత్రమే ఉన్న భారతీయ పౌరులకు యూఏఈలో లభించే 14 రోజుల షరతులతో కూడిన వీసా-ఆన్-అరైవల్ సౌకర్యం వర్తించదు. ఈ కొత్త నిబంధన ఇంకా అధికారికంగా అమలులోకి రానప్పటికీ, గతంలో యూకే నివాస హోదా ఆధారంగా దుబాయ్, అబుదాబి వంటి నగరాలకు సులభంగా ప్రయాణించిన భారతీయ పర్యాటకులు, నిపుణులు, వ్యాపారవేత్తలపై ఇది ప్రత్యక్ష ప్రభావం చూపనుంది. యూకే నివాస వీసా ఉన్నవారికి ఈ సదుపాయాన్ని రద్దు చేసినప్పటికీ, కొన్ని ఇతర అంతర్జాతీయ ప్రయాణ పత్రాలు కలిగిన భారతీయులకు వీసా-ఆన్-అరైవల్ సౌకర్యం యథాతథంగా కొనసాగుతుంది. చెల్లుబాటు అయ్యే యూఎస్ సందర్శన వీసా, యూఎస్ గ్రీన్ కార్డ్, ఈయూ సందర్శన వీసా లేదా ఈయూ నివాస వీసా కలిగిన భారతీయ పాస్‌పోర్ట్ హోల్డర్లు ఇప్పటికీ 14 రోజుల వీసా-ఆన్-అరైవల్‌కు అర్హులుగా ఉంటారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం, ఈ వీసాను అవసరమైతే అదనంగా మరో 14 రోజులు పొడిగించుకునే అవకాశం కూడా ఉంది. ఈ మార్పులతో పాటు ప్రయాణికులకు ఒక సానుకూల వార్త కూడా అందుబాటులోకి రానుంది. అర్హులైన భారతీయ పౌరుల కోసం యూఏఈ ప్రభుత్వం సరికొత్తగా 60 రోజుల షరతులతో కూడిన వీసా-ఆన్-అరైవల్ ఎంపికను ప్రవేశపెట్టే యోచనలో ఉంది. దీని అర్హత నిబంధనలు కూడా ప్రస్తుత 14 రోజుల వీసా నిబంధనల మాదిరిగానే ఉండే అవకాశం ఉంది. అయితే దీని అమలు తేదీని ఇంకా అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఈ తాజా మార్పుల నేపథ్యంలో.. ప్రత్యేకంగా యూఎస్ లేదా ఈయూ వీసాలు లేకుండా కేవలం యూకే వీసాపై ఆధారపడే భారతీయులు.. ఇకపై ప్రయాణానికి ముందే ఆమోదిత విమానయాన సంస్థలు లేదా అధీకృత మార్గాల ద్వారా యూఏఈ పర్యాటక వీసా కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.యూఏఈలో భారత పాస్‌పోర్ట్, వీసా సేవల్లో కీలక మార్పులు: జూలై 1 నుంచి కొత్త నిబంధనలు ఇవే! అంతర్జాతీయ ప్రయాణాలు, భద్రతా తనిఖీలు, ప్రవేశ విధానాలను మరింత సమర్థవంతంగా నిర్వహించడానికి యూఏఈ తన వీసా విధానాలను క్రమం తప్పకుండా నవీకరిస్తుంది. ఇమ్మిగ్రేషన్ కన్సల్టెన్సీ 'ఫ్రాగోమెన్' నివేదిక ప్రకారం.. భారతీయులతో పాటు ఆస్ట్రేలియా, కెనడా, జపాన్, సింగపూర్ వంటి పలు దేశాల పౌరుల బస కాలవ్యవధిపై కూడా యూఏఈ స్పష్టతలను ఇచ్చింది. ప్రయాణ సమయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండటానికి, విమాన టిక్కెట్లు బుక్ చేసుకునే ముందే ప్రయాణికులు తమ వీసా అర్హతలను సరిచూసుకోవాలని వలస నిపుణులు సూచిస్తున్నారు. ఒకవేళ అర్హతపై ఎలాంటి స్పష్టత లేకపోతే, విమానాశ్రయంలో ఇబ్బందులు పడకుండా ముందుగానే సాధారణ యూఏఈ వీసా కోసం దరఖాస్తు చేసుకోవడం సురక్షితం.

# బెంగళూరులో ఇళ్లకు భారీ డిమాండ్





దేశంలోనే నంబర్ వన్..! దేశంలో ఇళ్ల కొనుగోళ్లు తగ్గినప్పటికీ బెంగళూరులో మాత్రం ఆ పరిస్థితి కనిపించలేదు. బెంగళూరులో ఇళ్లకు డిమాండ్ ఉందని అనారాక్ రీసెర్చ్ తెలిపింది. దేశంలో అత్యధిక అమ్మకాలు ముంబైలో ఉండగా.. ఢిల్లీ ఎన్సీఆర్ లో కూడా ఇళ్లకు డిమాండ్ ఉంది. దేశంలోని నగరాల్లో గృహ అమ్మకాలు గత ఏడాది 96,285 ఇళ్లు అమ్ముడయ్యాడు. అయితే 2026 రెండవ త్రైమాసికంలో 6 శాతం తగ్గింది. 90,715 యూనిట్లకు పడిపోయాయి. అయితే కొత్త గృహ నిర్మాణ ప్రాజెక్టులు వార్షికంగా 7 శాతం పెరిగి సుమారు 1.06 లక్షల యూనిట్లకు చేరుకున్నాయి. స్వల్పకాలిక ప్రతికూలతలు ఉన్నప్పటికీ, దీర్ఘకాలిక డిమాండ్‌పై డెవలపర్లు విశ్వాసంతో ఉన్నారు. వార్షికంగా అమ్మకాల వృద్ధిని నమోదు చేసిన మూడు నగరాల్లో బెంగళూరు ఒకటి. ఈ త్రైమాసికంలో నివాస అమ్మకాలు 1 శాతం పెరిగి సుమారు 15,285 ఇళ్లకు చేరుకున్నాయి. ఈ నగరంలో కొత్త ఇళ్లు, అపార్ట్ మెంట్ల నిర్మాణం ఎక్కువగా కనిపించింది. కొత్తగా ప్రారంభించిన గృహాలు గత ఏడాదితో పోలిస్తే 41 శాతం పెరిగి సుమారు 21,670 ఇళ్లకు చేరుకున్నాయి. దాదాపు 96 శాతం రూ.80 లక్షల కంటే ఎక్కువ ధర ఉన్న ప్రీమియం, లగ్జరీ ఇళ్లే ఉన్నాయి. దీన్ని బట్టి ఇక్కడ డబ్బు ఉన్నవారు ఉన్నారని తెలుస్తోంది. అయితే ఇక్కడ గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్, ఐటీ కంపెనీల్లో పని చేస్తున్నవారు ఎక్కువ మంది ఉండడంతో ఇళ్లకు డిమాండ్ పెరిగినట్లు నివేదిక పేర్కొంది. ఈ నగరంలో గృహాల ధరల్లో 8 శాతం వార్షిక పెరుగుదల నమోదైనట్లు వివరించింది. టాప్ ఏడు నగరాలలో అందుబాటులో ఉన్న ఇళు (అమ్మడానికి సిద్ధంగా ఉన్న ఇళ్లు అత్యధిక ఉన్నాయి. అమ్ముడుపోని ఇళ్ల సంఖ్య గత ఏడాదితో పోలిస్తే 34% పెరిగింది. ఉపాధి కేంద్రాలు, మౌలిక సదుపాయాల ఆధారిత కారిడార్లు పరిసర ప్రాంతాల్లో ప్రీమియం గృహాలు డిమాండ్ కనిపిస్తున్నట్లు పేర్కొంది. అటు ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ 8 శాతం వార్షిక క్షీణతను నమోదు చేసినప్పటికీ.. 2026 రెండవ త్రైమాసికంలో సుమారు 28,710 ఇళు అమ్ముడయ్యాయి. ముంబై, బెంగళూరులో కలిసి దాదాపు 44,000 ఇళ్ల అమ్మకాలు జరిగాయి. కొత్త ప్రాజెక్టుల ప్రారంభంలో కూడా ఈ రెండు నగరాలే ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. ఈ త్రైమాసికంలో ముంబైలో దాదాపు 34,555 కొత్త ఇళ్ల నిర్మాణం ప్రారంభం అయింది. ఇది గత సంవత్సరంతో పోలిస్తే 23 శాతం ఎక్కువ. బెంగళూరు 21,670 కొత్త ఇళ్ల నిర్మాణం ప్రారంభం అయ్యాయి. బెంగళూరులో ఐటీ అభివృద్ధి, మౌలిక సదుపాయాల అభివృద్ధితో అక్కడ ఇళ్లు కొనుగోలు చేసేవారి సంఖ్య పెరుగుతోంది. అంతేకాకుండా అక్కడ అద్దెకు ఉండడం కంటే.. సొంత ఇల్లు కొనుగోలు చేయడమనే ఆలోచనలో చాలా మంది ఉన్నారు. అందుకే అక్కడ ఇళ్లకు డిమాండ్ పెరిగినట్లు చెబుతున్నారు.

## సెన్సార్ పూర్తి చేసుకున్న ఆలియా 'ఆల్ఫా'.. రన్‌టైమ్ ఎంతంటే?

బాలీవుడ్ స్టార్ బ్యూటీ ఆలియా భట్ ప్రధాన పాత్రలో నటించిన మోస్ట్ అవేటెడ్ స్పై యాక్షన్ థ్రిల్లర్ 'ఆల్ఫా' విడుదలకు సర్వం సిద్ధమైంది. తాజాగా ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసుకుని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ నుండి 'యు/ఏ 16+' సర్టిఫికేట్‌ను సొంతం చేసుకుంది. మొత్తం 2 గంటల 20 నిమిషాల (140 నిమిషాలు) రన్‌టైమ్‌తో వస్తున్న ఈ చిత్రంలో ఫస్టాఫ్ 1 గంట 13 నిమిషాలు, సెకండాఫ్ 1 గంట 7 నిమిషాలు ఉండనుంది. సెన్సార్ బోర్డు సినిమాలో పెద్దగా సీన్లు ఏవీ తొలగించనప్పటికీ, ఫస్టాఫ్‌లోని కొన్ని పదాలను మ్యూట్ చేయడంతో పాటు సెకండాఫ్‌లో వచ్చే కొన్ని తీవ్రమైన హింసాత్మక సన్నివేశాలను తగ్గించి ప్రత్యామ్నాయ విజువల్స్ ఉంచాలని సూచించింది. అలాగే ప్రారంభ డిస్క్లైమర్ కార్డ్ మార్పు, పాటలకు సబ్‌టైటిల్స్, మద్యం సీన్లలో హెచ్చరికలు చేర్చాలని మేకర్స్‌ను ఆదేశించింది. యష్ రాజ్ ఫిల్మ్స్ (వైఆర్ఎఫ్) ప్రతిష్టాత్మక 'స్పై యూనివర్స్' లో వస్తున్న మొదటి మహిళా ప్రధాన చిత్రం ఇదే కావడం విశేషం. శివ్ రవైల్ దర్శకత్వంలో ఆలియా భట్, శర్వరి వాగ్, అనీల్ కపూర్, బాబీ డియోల్, ఆర్. మాధవన్ ముఖ్య పాత్రల్లో నటించిన ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ జూలై 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో భారీ అంచనాల మధ్య విడుదల కానుంది.




## టాలీవుడ్‌లో సరికొత్త సాంకేతిక అద్భుతం.. తొలి పూర్తి స్థాయి ఏఐ మూవీగా 'అంబ'ం రివెంజ్'!



తెలుగు సినీ పరిశ్రమలో సాంకేతిక విప్లవానికి సరికొత్త నాంది పలుకుతూ 'అంబ'ం రివెంజ్' అనే అద్భుత చిత్రం శరవేగంగా ముస్తాబవుతోంది. నక్క తోక ఫిలిమ్స్ బ్యానర్‌పై యోగేంద్ర పొట్లూరి, రాణి మాడిసన్ అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, జయవర్ధన్ మడి సరికొత్త ఆలోచనలతో ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. టాలీవుడ్ చరిత్రలోనే సరికొత్త మైలురాయిగా నిలిచేలా, పూర్తి స్థాయి కృత్రిమ మేధ సహకారంతో రూపొం దుతున్న తొలి తెలుగు ఫీచర్ ఫిల్మ్‌గా ఈ మూవీ రికార్డు సృష్టిస్తూ, తాజాగా తన ప్రచార కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. భారత అత్యున్నత ఇతిహాసమైన మహాభారతంలోని అత్యంత శక్తివంతమైన, ప్రతికారేచ్ఛ గల పాత్ర 'అంబ' స్ఫూర్తితో ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కిస్తున్నారు. ఆ పురాణ గాథను నేటి ఆధునిక దృక్పథానికి అనుగుణంగా మలుస్తూ, అత్యాధునిక ఏఐ సాంకేతికతను మేళవించి వినూత్నంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావా లని చిత్ర బృందం ఎంతో పట్టుదలతో పనిచేస్తోంది. ఈ చిత్రానికి సంబంధించిన ఏఐ విజువల్ డిజైన్ ఌ డెవలప్‌మెంట్‌ను ప్రసిద్ధ 'కాలై విజువల్ స్టూడియోస్' అందిస్తుండటం సినిమాపై అంచనాలను పెంచుతోంది. ఈ ప్రయోగాత్మక చిత్రం గురించి నిర్మాతలు యోగేంద్ర పొట్లూరి, రాణి మాడిసన్ మరియు దర్శకుడు జయవర్ధన్ మడి మాట్లాడుతూ, తెలుగు సినిమా రంగానికి ఇది ఒక కొత్త ప్రయోగాత్మక అధ్యాయానికి నాంది అని ఎంతో గర్వంగా ప్రకటించారు.

## బ్రేకప్ రూమర్లకు కృతి సనన్ ఫుల్ స్టాప్..

### బాయ్‌ఫ్రెండ్ కబీర్‌తో ఫోటో వైరల్!




బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కృతి సనన్ వ్యక్తిగత జీవితం మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. గత కొంతకాలంగా లండన్‌కు చెందిన వ్యాపారవేత్త కబీర్ బాహియాతో ఆమె ప్రేమలో ఉన్నట్లు ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. అయితే ఇటీవల వీరిద్దరూ విడిపోయారంటూ సోషల్ మీడియాలో పలు కథనాలు వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో కృతి చేసిన తాజా ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ ఆ రూమర్లకు చెక్ పెట్టిందా అనే చర్చ మొదలైంది. కృతి సనన్ ఇటీవల తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఈ ఏడాది తొలి ఆరు నెలలకు సంబంధించిన ప్రత్యేక క్షణాలను 'హాఫ్ ఇయర్లీ డంప్' పేరుతో అభిమానులతో పంచుకున్నారు. ఈ ఫోటోలలో ఆమె కుటుంబ సభ్యులు, సోదరి నుపూర్ సనన్, పెంపుడు కుక్క, పర్యటనలకు సంబంధించిన చిత్రాలతో పాటు నటి రష్మిక మందన్నతో దిగిన ఫోటోలు కూడా ఉన్నాయి. అయితే అందరి దృష్టిని ఆకర్షించింది కబీర్ బాహియాతో ఉన్న ఒక ఫోటో. లైవ్ మ్యూజిక్ ఈవెంట్‌లో ఇద్దరూ కలిసి కనిపించిన ఈ ఫోటోలో ఒకరినొకరు ఆప్యాయంగా హత్తుకున్నట్లు కనిపించారు. దీంతో వీరిద్దరూ ఇప్పటికీ రిలేషన్‌లోనే ఉన్నారనే అభిప్రాయాలు సోషల్ మీడియాలో వ్యక్తమవుతున్నాయి. కొద్ది రోజుల క్రితం కబీర్ బాహియా మరో యువతితో కలిసి ఉన్న ఫోటో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, కృతి--కబీర్ మధ్య బ్రేకప్ జరిగిందనే ప్రచారం మొదలైంది. అయితే జాతీయ మీడియా కథనాల ప్రకారం, కబీర్‌కు సన్నిహిత వర్గాలు ఆ ప్రచారాన్ని ఖండించాయి. వైరల్ అయిన ఫోటోలో కనిపించిన యువతి కబీర్ కుటుంబానికి అత్యంత సన్నిహితురాలని, ఆమెను ఆయన సోదరిలా భావిస్తారని పేర్కొన్నట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియకుండా సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం జరిగిందని వారు తెలిపినట్లు ఆ కథనాలు వెల్లడించాయి. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో కృతి సనన్ తన వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడారు. తన సంబంధాలపై బహిరంగంగా చర్చించేందుకు ఆసక్తి లేదని, వివాహం జరిగే వరకు వ్యక్తిగత విషయాలను ప్రైవేట్‌గా ఉంచాలనుకుంటున్నానని ఆమె చెప్పారు.

## సినిమాల్లో ఆ హీరోయిన్ అంటే క్రష్: ఆనంద్ దేవరకొండ



టాలీవుడ్ హీరో ఆనంద్ దేవరకొండ ప్రస్తుతం ఎపిక్ మూవీలో నటిస్తున్నారు. ఈ చిత్రంలో బేబీ మూవీ ఫేమ్ వైష్ణవి చైతన్య మరోసారి ఆనంద్ సరసన హీరోయిన్‌గా కనిపించనుంది. ఈ సినిమాకు ఆదిత్య హాసన్ దర్శకత్వం వహిస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. ఇప్పటికే టీజర్ రిలీజ్ కాగా.. అద్భుతమైన రెస్పాన్స్ సొంతం చేసుకుంది. ఇక ఈ సినిమా సంగతి పక్కన పెడితే ఆనంద్ దేవరకొండ తాజాగా ఓ ఈవెంట్‌కు హాజరయ్యారు. సమ్మర్ హాలీడేస్ మూవీలోని క్రష్ సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో ముఖ్య? అతిథిగా పాల్గొన్నారు. ఈ ఈవెంట్‌లో ఆనంద్‌కు ఆసక్తికర ప్రశ్న ఎదురైంది. మీ ఫస్ట్ క్రష్ ఎవరు? అని యాంకర్ ప్రశ్నించారు. దీనికి ఆనంద్ దేవరకొండ నవ్వుతూ సమాధానమిచ్చారు. ఏదైనా సినిమా చూసేటప్పుడు హీరోయిన్లపై క్రష్ ఉంటుంది.. అలా మురారి చూసినప్పుడు నాకు సోనాలి బింద్రేపై క్రష్ ఫీలింగ్ వచ్చిందని అన్నారు. కాగా.. రోహన్ రాయ్, అరుణ్ దేవ్ ప్రధానపాత్రల్లో, శ్రీకర్ నాయన్ తెరకెక్కిస్తోన్న చిత్రం సమ్మర్ హాలీడేస్. ఈ మూవీని బాల్యం కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ చిత్రంలో జయసుధ, వాసుకి ఆనంద్, రాజీవ్ కనకాల కీలక పాత్రలు పోషిస్తున్నారు.




## 'అమీర్ లోగ్' టీంకు రానా దగ్గుబాటి సపోర్ట్.. హైప్ పెంచేస్తున్న నయా అప్‌డేట్..!

టాలీవుడ్‌లో యూత్‌ఫుల్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చే సినిమాలకు మంచి క్రేజ్ ఉంటుందని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఇదే జోనర్‌లో యూత్‌ఫుల్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా వస్తున్నచిత్రం అమీర్ లోగ్. రమణారెడ్డి సోమ డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రంలో ఎంసీ హరి, మనోజ్, శశిధర్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. వేదా జలంధర్, రావణ్ నిట్టూరు, విశ్వేందర్ రెడ్డి, సాయి యోగి కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ఆసక్తికర వార్త సినిమాపై అంచనాలు పెంచేస్తుంది. అమీర్ లోగ్ తెలుగు రాష్ట్రాల పంపిణీ హక్కులను టాలీవుడ్ యాక్టర్ రానా నేతృత్వంలోని స్పిరిట్ మీడియా సొంతం చేసుకుంది. హైదరాబాద్ గల్లీ బ్యాక్‌డ్రాప్‌లో ముగ్గురు స్నేహితుల మధ్య కథ నేపథ్యంలో కామెడీతోపాటు కంటెంట్‌ను నమ్మి వస్తున్న సినిమా కావడం, రానా టీం విడుదల చేస్తుండటంతో హైప్ పెరిగిపోతుంది. ఈ మూవీని అవ్వల్ నంబర్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై మాధవి రెడ్డి సోమ తెరకెక్కిస్తున్నారు. అమీర్ లోగ్ సినిమాలో రాహుల్ సిప్లిగంజ్ పాడిన అవ్వల్ దావత్ సాంగ్ యూట్యూబ్‌లో మిలియన్‌కు పైగా వ్యూస్‌తో ట్రెండింగ్‌లో నిలిచిందని తెలిసిందే. రాహుల్ సిప్లిగంజ్ మాసీ వాయిస్, మరోవైపు ఆనీ మాస్టర్ మాస్ డ్యాన్స్‌తో ఫ్లోర్ దద్దరిల్లిపోయేలా సాగుతున్న ఈ సాంగ్‌ను ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు మూవీ, మ్యూజిక్ లవర్స్. ఇప్పటికే లాంచ్ చేసిన అమీర్ లోగ్ ఫస్ట్ లుక్ పోస్టర్ నెట్టింట చక్కర్లు కొడుతోంది. ఈ మూవీకి స్మరణ్ సాయి సంగీతం అందిస్తున్నాడు.

## అమెరికాలో సమంత సెన్సేషన్.. 'మా ఇంటి బంగారం'తో 2026లో అరుదైన రికార్డు!




స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో నటించి, నిర్మించిన 'మా ఇంటి బంగారం' బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా దూసుకెళ్తోంది. కొంత విరామం తర్వాత తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చిన సమంత, ఈ సినిమాతో మరోసారి తన స్టార్‌డమ్ ఏమాత్రం తగ్గలేదని నిరూపించినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. థియేటర్లలో మంచి ఆదరణతో ప్రదర్శితమవుతున్న ఈ చిత్రం తెలుగు రాష్ట్రాలతో పాటు విదేశీ మార్కెట్లలోనూ ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా అమెరికా బాక్సాఫీస్ వద్ద సినిమా నమోదు చేస్తున్న వసూళ్లు సినీ వర్గాల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, 'మా ఇంటి బంగారం' అమెరికాలో రెండో మంగళవారం ఒక్క రోజులోనే 70 వేల డాలర్లకు పైగా గ్రాస్ వసూలు చేసినట్లు తెలుస్తోంది. దీంతో 2026లో విడుదలైన తెలుగు చిత్రాల్లో రెండో మంగళవారం అత్యధిక వసూళ్లు సాధించిన సినిమాగా నిలిచిందని ట్రేడ్ విశ్లేషకులు పేర్కొంటున్నారు.అయితే ఈ వసూళ్లపై చిత్రబృందం లేదా అధికారిక బాక్సాఫీస్ వర్గాల నుంచి ఇంకా స్పష్టమైన ప్రకటన వెలువడలేదు. అమెరికా మార్కెట్‌లో స్థిరంగా వసూళ్లు కొనసాగిస్తున్న ఈ చిత్రం, త్వరలోనే 2 మిలియన్ డాలర్ల గ్రాస్ మార్క్‌ను చేరుకునే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఒక మహిళా ప్రధాన పాత్రతో తెరకెక్కిన సినిమా ఈ స్థాయిలో వసూళ్లు నమోదు చేయడం విశేషంగా చెప్పబడుతోంది. 'మా ఇంటి బంగారం'తో సమంత మరోసారి తన మార్కెట్ బలాన్ని చాటుకున్నారని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కథానాయిక ప్రాధాన్యమున్న కథను ఎంచుకుని ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో పాటు, నిర్మాతగా కూడా ఈ సినిమాతో విజయాన్ని అందుకున్నట్లు చెబుతున్నారు. దర్శకురాలు నందిని రెడ్డి రూపొందించిన ఈ చిత్రంలో భావోద్వేగాలు, కుటుంబ అనుబంధాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. సమంత నటనకు ప్రేక్షకులతో పాటు విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు లభిస్తున్నాయి. ప్రస్తుతం థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శితమవుతున్న 'మా ఇంటి బంగారం', దేశీయ మార్కెట్‌తో పాటు ఓవర్సీస్‌లోనూ తన జోరు కొనసాగిస్తూ 2026లో టాలీవుడ్‌కు చెందిన విజయవంతమైన చిత్రాల్లో ఒకటిగా నిలిచే దిశగా అడుగులు వేస్తోంది.

PRINTED, PUBLISHED AND OWNER BY B.JAVEED BASHA Printed at M/S Aliya Publication, #7/235 - A Maniyar Street,Near Main Bazar, Tadipatri - 515411,Anantapur District Andra Pradesh, Published at M/S Aliya Publication, #7/235-A Maniyar Street,Near Main Bazar Tadipatri - 515411 ,Anantapur District,Andra Pradesh - 515411 EDITOR B.JAVEED BASHA RNI. NO : APTEL/2022/90211, Cell : 83339 79192 , 83339 75354 , E-mail : akshratimes@gmail.com